


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 22 ఫిబ్రవరి 2022 సంపుటి:03 సంచిక:168 పేజీలు:4 వెల: రూ



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి B.A.LL.B
ఆళ్ళగడ్డ
9440232308,9494498787


# మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణం వెనక అసలేం జరిగింది? రాత్రి అందరితో కలసి నిశ్చితార్థంలో పాల్గొన్న మంత్రి గౌతమ్ రెడ్డి. ఉదయానికల్లా మృతి చెందడానికి అసలు సిసలు కారణాలేంటి? ఉదయం ఎన్నింటికి ఆయనకు గుండె పోటు వచ్చింది? ఎంతో కూల్ గా ఉండే మేకపాటికి హార్ట్ అటాక్ ఎలా వచ్చింది? ఎంతో కఠిన వ్యాయామాయాలను చేసే గౌతమ్ రెడ్డికి ఈ అనారోగ్యమేంటి? ఎక్కడైనా హోటల్ లో దిగినా సరే జిమ్ ఫెసిలిటీ చూసుకునే వ్యక్తికి ఇలాంటి దుర్మరణం ఎలా వచ్చింది? అన్నదిపుడు అందరినీ తొలిచేస్తున్న ప్రశ్న. అయితే సోమవారం ఉదయం గౌతమ్‌రెడ్డి మరణానికి ముందు 90 నిమిషాల పాటు ఏం జరిగింది?మేకపాటికి ఉదయం ఐదున్నర ఆరు గంటలకు నిద్ర లేచి కాఫీ తాగే అలవాటు. కానీ ఈ రోజు మాత్రం గౌతమ్ కాఫీ తాగలేదు. ఉదయం 7. 20కి సోఫాలో వచ్చి కూర్చున్నారు. ఆ వెంటనే కుప్పకూలిపోయారు. చెమటలు పట్టడం గుర్తించి ప్రాథమిక వైద్యం అందించారు. ఆ వెంటనే ఆయన్ను అపోలోకి చేర్చారు. ఆ తర్వాత డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించారు. కానీ అవేవీ ఫలించలేదు. సరిగ్గా సోమవారం ఉదయం 9 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచినట్లు చికిత్స అందించిన అపోలో వైద్యులు ధృవీకరించారు.కాగా.. ఉదయం 7:30 గంటలకు జిమ్‌కు వెళ్దామని సిద్ధమయ్యారని.. ఇంట్లో నుంచి బయటికి రాకముందే ఛాతిలో నొప్పిగా ఉందని సోఫాలోనే కూర్చుకున్నారని గౌతమ్ ఇంటి వంట మనిషి కొమురయ్య చెబుతున్నారు. వెంటనే ఆయన్ను కుటుంబ సభ్యులు, గన్‌మెన్‌లు అపోలో ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికే ఆయన మృతిచెందారు. గౌతమ్‌రెడ్డికి భార్య శ్రీకీర్తి, కుమార్తె అనన్యరెడ్డి, కుమారుడు అర్జున్‌రెడ్డి ఉన్నారు. మంత్రి మృతిపట్ల తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు, పలువురు పారిశ్రామికవేత్తలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఇంట్లో పనిమనుషులు కొమరయ్య, చందు ఇచ్చిన సమాచారం ప్రకారం ఓసారి చూద్దాం.

ఉ 7.00 ? నిద్రలేచిన గౌతమ్ రెడ్డి



ఉ 7.10- బెడ్‌రూమ్ నుంచి బయటకి, సోఫాలో కూర్చున్న గౌతమ్‌రెడ్డి

ఉ 7.15- కాఫీ ఇచ్చిన వంటమిషని, వద్దన్న గౌతమ్

ఉ 7.25- చమటలు పడుతున్నాయంటూ గుండెపట్టుకున్న గౌతమ్

వెంటనే భార్య కీర్తి, కుమార్తె అనన్యకు పనిమనుషుల సమాచారం

ఉ 7.30- అప్పటికే స్పృహతప్పినట్లు గుర్తించిన కుటుంబీకులు

కాసేపు సపర్యలు చేసిన కుటుంబీకులు

ఉ 7.45 ? అపోలో ఆస్పత్రికి చేరిక

ఉ 9.00 ? చనిపోయినట్లు నిర్ధారించిన వైద్యులు

7.45 నుంచి దాదాపు 8.55 వరకూ.. అంటే దాదాపు 90 నిమిషాల పాటు ఆస్పత్రిలో అఖఫీ జరిగింది. అప్పటికీ బాడీ రెస్పాండ్ కాలేదు. ఇక ఆఖరి ప్రయత్నాలు ఫలించకపోవడంతో 9గంటల ప్రాంతంలో ఆయన చనిపోయిటన్లు ధృవీకరించారు. ఆయన మరణంపై అపోలో వైద్యులు కీలక ప్రకటన చేశారు. ఇవాళ ఉదయం 9.16 గంటలకు గౌతమ్‌రెడ్డి మృతిచెందినట్లు అపోలో వైద్యులు ప్రకటించారు. 'గౌతమ్‌రెడ్డి ఇంటి దగ్గర కుప్పకూలారు. ఉదయం 7.45 గంటలకు గౌతమ్‌రెడ్డిని అపోలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. స్పందించని స్థితిలో గౌతమ్‌రెడ్డిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆయన ఆస్పత్రికి వచ్చే సమయానికి శ్వాస ఆడట్లేదు. అత్యవసరం విభాగంలో తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది' అని వైద్యులు ప్రకటించారు.



గౌతమ్‌రెడ్డి భౌతికకాయానికి సీఎం జగన్ నివాళులు అర్పించారు. గౌతమ్‌రెడ్డి కుటుంబ సభ్యులను సీఎం జగన్ పరామర్శించారు. సీఎం జగన్‌ను చూసి గౌతమ్‌రెడ్డి తల్లి కన్నీరుమున్నీరయ్యారు. ఆయన గౌతమ్‌రెడ్డి తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఓదార్చారు.

# మంత్రి గౌతమ్‌రెడ్డి మృతి పట్ల రాజకీయ ప్రముఖుల సంతాపం



అమరావతి: మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హఠాన్మరణం పట్ల రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే గౌతమ్ రెడ్డి చాలా గొప్ప పేరు తెచ్చుకున్నారన్నారు. మంత్రిగా చాలా చురుగ్గా పని చేసి మంచి పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. నిన్నటి వరకు రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు కృషి చేశారన్నారు. గౌతమ్‌రెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మృతి పై టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబుగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంత్రి మేకపాటి మృతి కలచివేసిందని చంద్రబాబు అన్నారు. ఉన్నత చదువులు చదివిన, ఎంతో భవిష్యత్ ఉన్న మేకపాటి మృతి బాధాకరం అన్నారు. మంత్రివర్గం లో మృదు స్వభావిగా, హుందాగా వ్యవహరిస్తూ గౌతమ్ రెడ్డి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. గౌతమ్ రెడ్డి కుటుంబ సభ్యులకు చంద్రబాబు సానుభూతి తెలిపారు.

గౌతం రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించిన మంత్రి కేటీఆర్

గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి భౌతికకాయానికి మంత్రి కేటీఆర్ నివాళులర్పించారు. గౌతం రెడ్డి తండ్రి మేకపాటి రాజమోహన రెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఓ మంచి స్నేహితుడ్ని, అన్నను కోల్పోయా: మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

గౌతమ్‌రెడ్డి హఠాన్మరణం పట్ల మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఓ మంచి స్నేహితుడు, అన్నను కోల్పోయానన్నారు.

మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేసిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి గారి హఠాన్మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి గ్భ్రాంతి వ్యక్తం చేశారు. గౌతమ్ రెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు

ఏపీ ఐటి రంగంలో అభివృద్ధి చేసిన మేకపాటి గౌతంరెడ్డి మరణం బాధాకరమని మంత్రి అవంతి శ్రీనివాసరావు అన్నారు.. అభివృద్ధి చెందుతున్న ఏపీకి తీరని లోటు అవంతి పేర్కొన్నారు. సహచర మంత్రిగా స్నేహితునిగా ఆయన మరణం ఊహించుకోలేక పోతున్నామన్నారు.

రాష్ట్ర ఐ.టి.శాఖామంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హఠాన్మరణంపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసిన నూజివీడు ఎమ్మెల్యే మేకాప్రతాప్ ప్రతాప్ అప్పారావు.

మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హఠాత్మరణంపై తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేసిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ప్రభుత్వ హామీల అమలు కమిటీ చైర్మన్ కొట్టు సత్యనారాయణ. ఆయన అకాలమరణం పార్టీకి తీరని లోటు. ఒక సమర్థవంతమైన నాయకుడిని కోల్పోయాం.

మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మృతిపై సంతాపం వ్యక్తం చేసిన మంత్రి పేర్నినాని.

మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి హఠాన్మరణం పట్ల ఉప ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నానిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## నిన్ననే కలిసాను.. ఈరోజు ఇలా జరిగింది.. కంటతడి పెట్టుకున్న సోమిరెడ్డి

నెల్లూరు: రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గౌతమ్ రెడ్డిని నిన్ననే కలిశానని, ఈరోజు ఇలా జరిగిందని టీడీపీ నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కంటతడిపెట్టుకున్నారు. సోమవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ గౌతమ్ రెడ్డి మృతి తనను



కలచివేసిందన్నారు. ఇది చాలా దురదృష్టమని, ఒక మంచి వ్యక్తిని రాష్ట్రం కోల్పోయిందన్నారు. ఆదివారం రాత్రి 7:30 గంటలకు ఓ శుభ కార్యంలో ఇద్దరం కలుసుకున్నామని చెప్పారు. పార్టీలకు అతీతంగా పనిచేసే వ్యక్తి అని, వివాదరహితుడని కొనియాడారు. నిన్ననే కలుసుకుని, ఇవాళ ఆ వ్యక్తి లేరంటే జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు. గౌతంరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటంబ సభ్యులకు సోమిరెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

## ప్రత్యేక హెలికాప్టర్ కోసం ఆర్మీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం: ఏపీ అధికార ప్రతినిధి



అమరావతి: గౌతం రెడ్డి మరణం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తీరని లోటని ఏపీ అధికార ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి పెట్టుబడులు తీసుకురావాలని ఇటీవల దుబాయ్ వెళ్ళాడని, ఎప్పుడు హైదరాబాద్ వచ్చిన ఆప్యాయంగా రీసివ్ చేసుకునే వ్యక్తిన్నారు. ఈరోజు మన మధ్య లేకపోవడం దురదృష్టకరమన్నారు. బుధవారం రోజు నెల్లూరు తన సొంత గ్రామం బ్రాహ్మణపల్లి లో అంత్యక్రియలు జరుగుతాయని, ప్రత్యేక హెలికాప్టర్ కోసం ఆర్మీ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. రేపు నెల్లూరుకు గౌతంరెడ్డి పార్థివదేహాన్ని తరలిస్తామని తెలిపారు. ప్రభుత్వ లాంఛనాలతో గౌతం రెడ్డి అంత్యక్రియలు జరుగుతాయన్నారు.

# లాక్‌డౌన్‌లో వ్యాపారాలు మూతపడితే పాలకుల కండ్లు మూతపడ్డాయి : సోనియా గాంధీ



లక్నో : రైతుల సమస్యలు, నిరుద్యోగ సమస్య పరిష్కారంతో పాటు కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో మోదీ, యోగి సర్కార్లు ఘోరంగా విఫలమయ్యాయని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ విమర్శించారు. కాషాయ పార్టీ గొప్పగా చెప్పుకొంటున్న డబుల్ ఇంజిన్ సర్కార్ యూపీ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. యూపీ ప్రజల మధ్య విభేదాలు, చీలిక తేవడం మినహా వారు ఒరగబెట్టింది లేదని దుయ్యబట్టారు. సోమవారం ఓ ఆన్‌లైన్ కార్యక్రమంలో సోనియా గాంధీ మాట్లాడుతూ యూపీలో రైతులు కష్టాలకు ఓర్చి వ్యవసాయం చేస్తున్నా వారికి ఎరువులు రాయితీపై అందడం లేదని, నీటిపారుదల సౌకర్యాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. యువతకు యోగి సర్కార్ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తేవడం లేదని, పైగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపిందని ఆరోపించారు.లాక్‌డౌన్ సమయంలో వ్యాపారాలు మూతపడితే వలస కూలీలు కిలోమీటర్ల కొద్దీ నడిచి స్వస్థలాలకు చేరుకున్నారని అన్నారు. ప్రజలు ఇన్ని కష్టాలు పడితే మోదీ-యోగి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ ముఖం చెల్లక పాలకులు కండ్లు మూసుకున్నారని విమర్శలు గుప్పించారు. మోదీ-యోగి ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఊరట కల్పించలేదని దుయ్యబట్టారు. ఇక 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఏడు సీట్లతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ ఈసారి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఈనెల 23న జరగనున్న నాలుగో దశ పోలింగ్‌పై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. నాలుగో దశ పోలింగ్‌కు చివరిరోజైన సోమవారం ప్రచారం హోరెత్తించాయి. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచార గడువు ముగియనుంది. 9 జిల్లాల్లోని 60 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగో దశ పోలింగ్ జరగనుంది. తొలి మూడు దశల్లో 403 స్థానాలున్న యూపీలో 172 సీట్లకు పోలింగ్ జరిగింది.ఇక నాలుగో దశలో 624 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. గాంధీ కుటుంబానికి పట్టున్న లక్నో, రాయ్‌బరేలి ప్రాంతాల్లో ఇదే విడత పోలింగ్ జరగనుండటంతో నాలుగో దశ ఆయా పార్టీలకు రాజకీయంగా కీలకంగా మారింది.

# ఏపీకి పరిశ్రమలు వస్తాయన్నారు.. అంతలోనే ఇలా..: కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి




నెల్లూరు: మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే అభిమానులు, కార్యకర్తలు, స్నేహితులు మేకపాటి గెస్టు హౌస్‌కు తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఆయన మరణం తీవ్రగ్భ్రాంతికి గురిచేసిందని, మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. రాజకీయాల్లో గౌతమ్ రెడ్డి లాంటి వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారన్నారు. ఆయన వద్దకు ఎవరు వచ్చినా సహాయం చేసేవారని, అటువంటి వ్యక్తి లేకపోవడం చాలా బాధాకరమన్నారు.

దుబాయ్ పర్యటన ముగిసిన తర్వాత వచ్చిన ఆయన ఏపీకి పరిశ్రమలు వస్తాయని తెలిపారన్నారు. అంతలోనే ఇలా జరగడం నెల్లూరు జిల్లాకు, పార్టీకి తీరని లోటని అన్నారు.ఏపీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి కన్నుమూశారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. వారం రోజులు దుబాయ్ పర్యటన ముగించుకుని ఆదివారం హైదరా బాద్ వచ్చారు. సోమవారం ఉదయం ఆయనకు గుండెపోటు వచ్చింది. వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇటీవల అయన కోవిడ్ నుంచి కోలుకున్నారు. పోస్టు కరోనా లక్షణాల్లో భాగంగా గుండెపోటుకు కారణం కావచ్చునని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# నమ్మలేకపోతున్నాం: ఏపీ మంత్రులు



అమరావతి: మంత్రి గౌతమ్‌రెడ్డి మన మధ్యలేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ‘‘తోటి సహచరుడు ఎప్పుడూ సంతోషంగా ఉండే మనిషి. రాష్ట్ర అభివృద్ధి కోసం దుబాయ్ కూడా వెళ్లి పెట్టుబడుల మీటింగ్‌లో పాల్గొన్నారు. రేపు.. సీఎంతో గౌతమ్ రెడ్డి మీటింగ్ ఉంది. ఈలోపే ఇలా జరగటం బాధాకరం. ఆయన మాట్లాడే తీరు చూస్తే.. ముఖ్యమంత్రి కరెక్టు పర్సన్‌కే ఐటీ మంత్రి ఇచ్చారని అనుకునేవారమని కన్నబాబు అన్నారు.మంత్రి గౌతమ్‌రెడ్డి మరణ వార్త వినగానే షాక్ తిన్నామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. పల్స్ డౌన్ అవటం వల్ల ఆస్పత్రికి తీసుకుని వెళ్లారనుకున్నాం. కానీ ఇలా దూరం అవుతారనుకోలేదు. పార్టీ ఆవిర్భావం నుంచి జగన్‌కి వెన్నంటి ఉన్న ఫ్యామిలీ మేకపాటి వారిది. ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు పలు రకాలుగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటారు. ఆయన లేని లోటు పార్టీకి తీర్చలేనిదని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.ఏదైనా పని ఉందంటే వెంటనే స్పందించే గుణం గౌతమ్‌రెడ్డిదని ఎమ్మెల్యే మేరుగ నాగార్జున అన్నారు. ఏదైనా పని ఉందంటే వెంటనే స్పందించే గుణం గౌతమ్‌రెడ్డిది. అలాంటి వ్యక్తి ఇప్పుడు దూరం కావడం జీర్ణించుకోలేకపోతున్నామని మేరుగ నాగార్జున అన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 22 ఫిబ్రవరి 2022

## కేంద్రం చేతిలో కీలు బొమ్మలా....

దారిలోకి వస్తే సరే.. లేకపోతే అంతే సంగతులు. ప్రత్యర్థులను దారిలోకి తెచ్చుకునేందుకు సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించడం మనకు తెలిసిందే. భారత రాజకీయాల్లో ఇప్పుడు ఇది బాగా హాట్ టాపికైంది. అధికారంలో ఎవరున్నా కేంద్రంలోని పాలకులపై ఇదే విమర్శలు. చెప్పింది వింటే సరేసరి. లేకపోతే వారి పై ఇఆ కేసులు, అఃఐ కేసులు, ఎ సోదాలు షరామూములు వ్యవహారమైందనే విమర్శలొస్తున్నాయి. గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ఇదే పని చేసిందనే ఆరోపణలు రాగా..ఇప్పుడు భారతీయ జనతా పార్టీ పైనా అదే తరహా విమర్శలు గుప్పుమంటున్నాయి. తమ రాజకీయ ప్రయోజనాలకు ఈడీ, ఐటీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను కీలుబొమ్మలుగా కేంద్రం వాడుకుంటోందని విపక్షాలు గగ్గోలు పెడుతున్నాయి. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఇప్పుడు ఈ కేసులు రావడం ఉత్కంఠను పెంచుతోంది. ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు రచించడం మాములు విషయమే. కాకపోతే ఇప్పుడు ఆర్థికంగా దెబ్బతీసే కుట్ర జరుగుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇందుకు ఇటీవల జరుగుతున్న పరిణామాలను సాకుగా చూపడం ఆసక్తికరం.భారతదేశవ్యాప్తంగా మొత్తం 121మంది ప్రజాప్రతినిధులపై సీబీఐ కేసులున్నాయి. 122 మంది నేతలపై ఈడీ కేసులుండటం మాములు విషయం కాదు. ఎంపీ, ఎమ్మెల్యేలపై ఈ కేసుల విచారణ కొనసాగుతోంది. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపింది అమికస్ క్యూరీ. ఏళ్ల తరబడి కేసులు పెండింగ్ లో ఉండటం ఇబ్బందికరమే. ఈ లోపే నేతలు మరోసారి చట్టసభలకు ఎన్నికవుతున్నారు. ఫలితంగా మంచివాళ్లే కాదు..అక్రమార్కులు సభలో అడుగుపెట్టడం ప్రజాసామ్య భారతానికి వన్నె తెచ్చేది కాదుభారతదేశంలో సీబీఐ కేసులు ఎదుర్కొంటున్న 121 మందిలో 14 మంది సిట్టింగ్ ఎంపీలు కాగా..107 మంది మాజీ ఎంపీలు ఉన్నారు. ఓ ప్రజా ప్రతినిధిపై కేసు 20 ఏళ్లకు పైగా కేసు పెండింగ్ లో ఉంది. 121 కేసుల్లో 58 కేసుల్లో జీవిత ఖైదు, 48 కేసుల్లో సుదీర్ఘ కాలం శిక్ష పడే అవకాశం ఉంది. 51 మంది తాజా, మాజీ ఎంపీలపై మనిలాండరింగ్ కేసులు ఉండటం సాధారణ విషయం కాదు.పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ మేనల్లుడు టీఎంసి ఎంపీ అభిషేక్ బెనర్జీ, ఆయన భార్య రుజీరా బెనర్జీకి ఈడీ నోటీసులిచ్చి విచారించింది. బెంగాల్ బొగ్గు స్కామ్ లో ఆయన పై ఆరోపణలు చేసింది. అంతే కాదు తమిళనాడు సిఎం స్టాలిన్ కూతురు శంతమరాయి ఇంట్లో ఐటీ సోదాలు జరిగాయి. పంజాబ్ సీఎం చన్నీ మేనల్లుడు భూపిందర్ సింగ్ హనీ పై మనీ లాండరింగ్ కేసు నమోదైంది. ఈడీ అరెస్టు చేసింది. అక్రమ ఇసుక మైనింగ్ కేసులో భూపేందర్ సింగ్ హనీ పై ఆరోపణలున్నాయి. ఆయన ఇళ్లు, పలు కార్యాలయాల్లో దాడులు నిర్వహించడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.అంతే కాదు?బీజేపీపై గట్టిగా గళం వినిపించే ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌పై ఔఎం కేసు పెట్టేందుకు సిద్దమైందనే లీకులు వస్తున్నాయి. ఇప్పటికే సిఎం అధికారాలకు కత్తెర వేసి లెఫ్టినెంట్ జనరల్ కు బాధ్యతలు అప్పగించారనే వాదనుంది. ముందరి కాళ్లకు బంధం వేసినట్లుగా చేస్తుందంటున్నారు. ఇక ఉత్తరప్రదేశ్ లోని సమాజ్ వాదీ నాయకుల ఇళ్లల్లో ఐటీ సోదాలు జోరుగా సాగుతున్నాయి. ఆ పార్టీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నారనే వాదనుంది.ఇంకోవైపు ఆంధ్రప్రదేశ్ లో సిఎం జగన్మోహన్ రెడ్డి బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సిబిఐ ఛార్జిషీట్ వేసింది. ఇందులో ఎంపీ అవినాష్ రెడ్డి పేరుపై రగడ రేగుతోంది. ఇప్పటికే అక్రమాస్తుల కేసులో సిఎం జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి కోర్టులకు హాజరవుతున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వారి పై కేసులు రావడం వెనుక సోనియా హస్తం ఉందనే విమర్శలు లేకపోలేదు. ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ రాహుల్‌గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ పై నిప్పులు చెరుగుతున్న తీరు చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ సొంత సంస్థలు ఈడీలు, సీబిఐలకు నేను భయపడనని బాహాటంగానే చెబుతున్నారు రాహుల్ గాంధీ. 2006లో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నారు తెలంగాణ సిఎం కేసీఆర్. ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో 2015 అక్టోబర్ 22న సిబిఐ విచారించింది. దీని పై సరైన ఆధారాలు లేకపోవడంతో పక్కన పెట్టేసింది.నాపై ఎన్ఐఏ కేసు పెడుతున్నట్టు తెలిసింది.. మంచి పనులు చేసేవాళ్లను ఉగ్రవాదులుగా చూస్తారా?ఇదే మీరు చేసేది అంటూ ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తీరు ఆసక్తకరమే. ఆయనే కాదు తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేను సైతం అంటున్నారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తోంది. దేనికైనా రెడీ అంటున్నారు. ఇదంతా పులిమీద సవారీనే. ఎదురుతిరిగితే పోయేదేముంది. కొత్తగా మరిన్ని సీట్లు రావడం తప్పా అంటున్నారు గులాబీ నేతలు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు ఈడీ, ఎన్ఐఏ, ఐటీ, సిబిఐలు వచ్చినా తగ్గేదేలే అంటున్నారు ఇంకోవైపు తెలంగాణ మంత్రి కే.తారకరామారావు. ఈ దర్యాప్తు సంస్థలు గుజరాత్ మోసాలపై ఎందుకో కేసులు పెట్టవుఅనే అనుమానం వ్యక్తం చేశారు శివసేన ఎంపీ సంజయ్ రౌత్ లాంటి నేతలు. రాష్ట్రంలో ఐటీ ముందుగా వచ్చింది. తర్వాత ఈడీ, సిబిఐ వస్తాయి. ఏం జరుగుతుందో అర్థమవుతోందని యూపీ మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ చెబుతున్న ప్రజల్లో చర్చకు దారితీసింది.ప్రభుత్వం చేతిలో సిబిఐ కీలు బొమ్మ అనే కామెంట్లు వస్తున్నాయి. ఎదురు తిరిగితే వారిని దారిలోకి తెచ్చుకునేందుకు సిబిఐతో కేసులు వేయిస్తుందనే వాదనలొస్తున్నాయి. జగన్, చంద్రబాబు, జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్, హర్యానా మాజీ సిఎం భూపేందర్ హుడా, సోనియా అల్లుడు రాబర్ట్ వాద్రా, చిదంబరం వంటి వారు ఈడీ, సిబిఐ, ఐటీ కేసులు ఎదుర్కున్నవారే. మరికొందరి పై ఇంకా కేసులు కొండవీటి చాంతాడులా ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా పై కావాలనే కేసులు పెట్టారని కాంగ్రెస్ అంటోంది. ఉత్తరప్రదేశ్ మాజీ సిఎం మాయావతిపై 12 ఏళ్ల తర్వాత ఈడీ దాడులు పెట్టడం. ఇద్దరు మాజీ మంత్రులు అరెస్టు చేయడం ఎన్నికల వ్యూహం కోసమే అనే వాదన లేకపోలేదు. ఇక కేరళ సిఎం పినరయ్ విజయన్‌ను సిబిఐ ప్రశ్నించేందుకు సుప్రీంకోర్టు అనుమతి కోరడం వెనుక వ్యూహం కొనసాగుతుందంటున్నారు కామ్రేడ్స్.దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వెయ్యాలని వ్యూహంలో భాగమే కర్నాటక, తమిళనాడు, కేరళ, ఏపీ, తెలంగాణలో నేతల పై మనీలాండరింగ్ కేసులు, ఈడీ దాడులు, సిబిఐ ఎంక్వైరీలు అంటున్నాయి

# పుంగనూరు ఆవుకు గుర్తింపు

తిరుపతి, ఫిబ్రవరి 21, మనదేశంలో సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు ఎక్కువే. అందులోనూ గోమాతకు మనం ఎంతో ప్రాధాన్యత ఇస్తాం. ఇంట్లోనే ఆవుల్ని పెంచుకుంటాం. మన చుట్టూ తిరిగే ఆవు దూడలు మన పిల్లలతో సమానంగా పెంచుతాం. ఆవు ఇంట్లో తిరిగితే అది ఎంతో శుభదాయకం అంటారు. ఒక ఆవు జాతి వల్ల ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. అదే చిత్తూరు జిల్లా పుంగనూరు గ్రామం. పుంగనూరు ఆవుకు అనేక ప్రత్యేతలు ఉండడంతో ఎక్కువమంది ఈ ఆవుని పెంచుకోవడానికి ఎంతైనా ఖర్చుపెడతారు. పుంగనూరు ఆవుకి మరింత గుర్తింపునిచ్చే ప్రయత్నం చేసింది కేంద్ర ప్రభుత్వం. ఇటీవల పోస్టల్ శాఖ' పుంగనూరు జాతి ఆవు' పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల చేయడంతో ఆ గ్రామం , ఆవు జాతి గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.పుంగనూరు పొట్టి జాతి ఆవులతో మరో గుర్తింపు వచ్చింది. ప్రపంచంలోనే 70?90 సెం.మీ ఎత్తు అంటే సుమారు రెండు అడుగుల ఎత్తు వుండి 115 నుంచి 200 కిలోల బరువు ఉండే ఆవులు పుంగనూరు ఆవులు. లేత బూడిద, తెలుపు రంగులో విశాలమైన నుదురు, చిన్న కొమ్ములు కలిగి ఉంటాయి. ఇవి రోజుకు రెండు నుంచి మూడు లీటర్ల పాలు ఇస్తాయి. సాధార ఆవుపాలలో ఔషధ విలువలతో పాటు 3 నుంచి 3.5 వరకు వెన్న శాతం ఉంటుంది. అదే పుంగనూరు ఆవు పాలలో 8 శాతం ఉంటుంది. దీంతో ఈ ఆవుపాలకు మంచి ధర లభిస్తుంది. ఆరోగ్యానికి కూడా ఈ పాలు ఎంతో మంచివి.తిరుమల తిరుపతి దేవస్థానాల గోశాలలో పుంగనూరు ఆవులను పెంచుతూ ఈ ఆవు పాల నుంచి వచ్చే నెయ్యిని శ్రీవారి అభిషేకానికి వాడుతుండడం మరో విశేషం. గతంలో ఆవుల్ని చాలాకొద్దిమంది మాత్రమే మేపేవారు. కానీ ఇప్పుడు పుంగనూరు తరహా ఆవుల్ని కొనాలంటే లక్షలు పెట్టాల్సిందే. దీంతో ఈ ఆవులు రైతుల పాలిట కామధేనువులుగా మారాయి. తెలుగురాష్ట్రాల్లో ఉన్న పుంగనూరు ఆవుల సంఖ్య కేవలం మూడువందలు మాత్రమే అంటే వీటికి

ఎంత ప్రాముఖ్యత వుందో అర్థం చేసుకోవచ్చు. పుంగనూరు ఆవుల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. ఈ జాతి ఆవులు అంతరించి పోయే దశలో ఉండడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పుంగనూరు జాతి ఆవుల మనుగడకు, పునరుత్పత్తికి రూ.63 కోట్ల వ్యయంతో 'మిషన్ పుంగనూరు రీసెర్చ్ ప్రాజెక్టు' అమలుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం సహకారంతో కడప జిల్లా పులివెందులలోని ఏపీ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ ఆన్ లైవ్‌స్టాక్ లిమిటెడ్‌లో ఐవీఎఫ్ సాంకేతికతో పుంగనూరు జాతి పశువులను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నడుపుతోంది. పుంగనూరు ఆవు ఇంట్లో వుంటే అదో స్టేటస్ సింబల్. ఈ జాతి విశిష్టతను అందరికీ తెలియచేసేందుకు కేంద్రం పోస్టల్ స్టాంప్ విడుదల చేయడం పట్ల పుంగనూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎడాపెడా విద్యుత్ కోతలతో ఇక్కట్లు

విజయవాడ,ఫిబ్రవరి21 ఒక్కోసారి విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల గృహోపకరణాలు పాడైపోతున్నాయి. కొవిడ్ ప్రభావంతో ఇంటినుంచే పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కరెంట్ కోతలతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అనధికార విద్యుత్ కోతలపై వినియోగదారులు విద్యుత్ కార్యాలయాలకు, ఫ్యూజ్ కాల్ ఆఫీసుకు ఫోన్‌చేసినా సరైన సమాధానం రావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజూ 2 నుంచి 3 గంటలపాటు విద్యుత్ కోతలు విధిస్తున్నారు.పగలు, రాత్రి అనే తేడా లేకుండా అనధికార విద్యుత్ కోతను విధిస్తున్నారు. పగటిపూట నాలుగైదు దఫాలే కాకుండా రాత్రి 10గంటలలోపు రెండు గంటలపాటు విద్యుత్ కోత ఉంటోందని ప్రజలు వాపోతున్నారు. పేదలకు విద్యుత్ సబ్సిడీ ఎత్తివేయాలనే దుర్మార్గపు కుట్ర ఇందులో దాగి వుందని లెఫ్ట్ పార్టీలు ఆరోపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం మేరకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపులకు విద్యుత్ మీటర్లు ఇప్పటికే రాష్ట్రమంతా బిగిస్తున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ రాబోయే కాలంలో ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం మీటర్లు బిగించినా ప్రభుత్వమే విద్యుత్ ఛార్జీలు భరిస్తుందనే మాటలు ఎంతో కాలం చెల్లవు. విద్యుత్ ఉత్పత్తి చేసే జెన్‌కోలు, డిస్కంల ప్రయివేటీకరణ జరిగితే దాని దుష్ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ప్రయివేటీకరణ విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇదిలావుంటే నెల్లూరు జిల్లాలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ అత్యాధునికమైన సూపర్ క్రిటికల్ సాంకేతిక నైపుణ్యంతో నడుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జెన్‌కో సంస్థ ఆధ్వర్యంలో 1600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తున్నది. మరో 800 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో యూనిట్-3 నిర్మాణం 90 శాతం పూర్తి అయ్యింది. రూ.21 వేల కోట్లు పెట్టుబడి వ్యయంతో 1490 ఎకరాల్లో నిర్మించిన ఈ థర్మల్ ప్లాంటులో ఇంజనీర్లతో సహా అన్ని రకాల కార్మికులు 1810 మంది పనిచేస్తున్నారు. థర్మల్ ప్లాంటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు చౌకగా భూములిచ్చి త్యాగం చేశారు. ఇటువంటి భారీ కీలకరంగ పరిశ్రమను ప్రయివేటుకు 25 సంవత్సరాలకు లీజుకు ఇవ్వాలని రాష్ట్ర

### నష్టాల ముసుగులో ప్లాంట్ల ప్రైవీటీకరణ
### మండిపడుతున్న లెఫ్ట్ పార్టీల నేతలు

క్యాబినెట్ నిర్ణయించడం...స్థానిక ప్రజలు, కార్మికులు, రాష్ట్ర ప్రయోజనాలకు పూర్తి వ్యతిరేకిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం థర్మల్ ప్లాంటును అదానీ గ్రూపుకి అప్పగించాలనే నిర్ణయం చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టును సొంతం చేసుకున్న 'అదానీ గ్రూపు'నకు ఇప్పుడు థర్మల్ ప్లాంటుపై కన్నుపడింది. చుట్టూ అనేక ప్రయివేటు థర్మల్ ప్లాంట్లు ఉన్నా, లాభాలు బాగా వచ్చే దామోదరం సంజీవయ్య పవర్ ప్లాంట్‌నే కైవసం చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నట్లుసమచారం. దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌కు నష్టాలు వస్తున్నాయనే పేరుతో ప్రయివేటుకు అప్పగించాలనడం దారుణం అని ప్రజలు, విపక్షాలు విమర్శిస్తు న్నాయి. అత్యంత ఆధునికమైన థర్మల్ ఎ÷-లాంటును కారుచౌకగా ప్రయివేటుకు కట్టబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడుతున్నారు. మొదట ఈ థర్మల్ ప్లాంట్‌ను ప్రయివేటుకు ఇచ్చి, ఆ తర్వాత విజయవాడ, ఆర్‌టిపిపి ప్లాంట్లనూ ప్రయివేటుపరం చెయ్యాలన్నది సర్కారు యోచనగా వుంది. ఇకపై ప్రైవేటు థర్మల్ ప్లాంట్లు ఇంకా యూనిట్ ఛార్జీలు పెంచడం ఖాయమని అంటున్నారు. దానివల్ల రాష్ట్ర ప్రజలపై విద్యుత్ భారాలు పడతాయి. రాష్ట్రంలో మూడు డిస్కంలకు గత సంవత్సరం రూ.10045.61 వేల కోట్లు నష్టాలు వచ్చాయి. విద్యుత్ చార్జీలు పెంచాలని ఈ సంవత్సరం డిస్కాంలు ఇఆర్‌సి ముందు ప్రతిపాదించాయి. రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు కొరతను సృష్టించి నష్టాలు వస్తున్నాయని నెపం వేస్తున్నదని టిడిపి ఆరోపిస్తోంది. ప్రభుత్వం తరపున డిస్కంలు ఇచ్చే ఆర్డర్‌ను బట్టి విద్యుత్ ఉత్పత్తి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ప్రయివేటీకరణ విధానాల్లో భాగంగా జెన్‌కోలో అత్యంత అధునాతనమైన శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ ప్లాంటును ప్రయివేటుకు అప్పజెప్పాలనే నిర్ణయానికి వచ్చింది. ఒకవైపు అత్యంత ఎక్కువ ధరలకు బయట ప్రయివేటువారి నుండి విద్యుత్‌ను కొంటూ...రాష్ట్ర ప్రభుత్వం చేతిలోని ఒక భారీ విద్యుత్ కర్మాగారాన్ని ప్రయివేటుకు అప్పజెప్పడం వల్ల...ప్రజలపై రాబోయే కాలంలో భారాలు తీవ్రంగా పడతాయి.

# బాలయ్య ఎంట్రీతో పార్థసారథి సైలెంట్

అనంతపురం, ఫిబ్రవరి 21, ()అనంతలో జిల్లాల విభజనపై జరుగుతున్న రచ్చ అంతా ఇంతా కాదు. పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లా ఏర్పాటుపై హిందూపురంలో పెద్దఉద్యమమే జరుగుతోంది. జిల్లాలో అనంతపురం తర్వాత పెద్ద పట్టణమైన హిందూపురాన్ని కాకుండా మరో ప్రాంతాన్ని జిల్లా కేంద్రం ఎలా చేస్తారని ఉద్యమిస్తున్నారు. ఈ పోరాటంలోకి ఎమ్మెల్యే బాలకృష్ణ ఎంట్రీ ఇవ్వడంతో రెండురోజులపాటు జిల్లాలో రచ్చ రచ్చ అయింది. వాస్తవంగా జిల్లాల విభజన ప్రతిపాదన వచ్చాక ముందుగా వినిపించిన పేరు పెనుకొండ. అన్ని ప్రాంతాలకు సమానమైన దూరం, గొల్లపల్లి రిజర్వాయర్, పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ఉండటం.. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పట్టణం కావడంతో ఇక్కడే జిల్లా కేంద్రం ప్రకటించాలని ఉద్యమం జరిగింది. కరోనా కారణంగా కాస్త సైడ్ అయినా.. మున్సిపల్ ఎన్నికల్లో పెనుకొండ అంశమే ప్రధాన ప్రచారాస్త్రమైంది.పెనుకొండ మంత్రి శంకర్‌నారాయణ సొంత నియోజకవర్గం కావడంతో ఇక్కడ జిల్లా కేంద్రాన్ని తీసుకొస్తామని ఆయన హామీలు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి కూడా ఇదే అంశాన్ని చాలాసార్లు డిమాండ్ చేశారు. ఇదే హామీతో మంత్రి శంకర్‌నారాయణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేసి పార్టీని గెలిపించారు కూడా. అయితే జిల్లా కేంద్రం పెనుకొండ కాకుండా పుట్టపర్తికి వెళ్లింది. ఈ అంశంపై హిందూపురంలో పెద్ద ఉద్యమమే జరుగుతుంటే.. నిన్న మొన్నటి వరకు పెనుకొండ కోసం పట్టుబట్టిన వాళ్లు మాత్రం నోరు మెదపడం లేదు. ఏడాది క్రితం పెనుకొండ జిల్లా సాధన సమితి కూడా ఏర్పాటైంది. జిల్లా కేంద్రం తమ ఆకాంక్ష అని..చివరి వరకు పోరాటం చేసినా సాధ్యం కాలేదని మంత్రి చేతులు ఎత్తేశారు. తనవల్ల కానిది అవుతుందని చెప్పడం కంటే హ్యాండ్సప్ బెటర్ అనుకున్నట్టున్నారు మంత్రి.అయితే జనం నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్న మంత్రి శంకర నారాయణే ఇలా స్పందిస్తుంటే.. ఈ విషయంలో అధికారపార్టీని కార్నర్ చేయాల్సిన మాజీ ఎమ్మెల్యే పార్థసారథి అస్సలు నోరు విప్పడం లేదు. ఆయన కొన్నేళ్లుగా పెనుకొండ నుంచే ప్రాతినిథ్యం వహిస్తూ వస్తున్నారు. ఇప్పుడు జిల్లా కేంద్రంపై సైలెంట్ అయ్యారు. దానికీ బలమైన కారణం లేకపోలేదు. పార్థసారథి ప్రస్తుతం టీడీపీ హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఓపక్క హిందూపురం కోసం బాలయ్య రంగంలోకి దిగడంతో పెనుకొండను జిల్లా కేంద్రం చేయాలని అడిగితే మొదటికే మోసం వస్తుంది. అంతేకాదు పుట్టపర్తి, కదిరి, మడకశిక ప్రాంత వాసులు దానిని తీవ్రంగా తప్పుపట్టి, వ్యతిరేకించే అవకాశం ఉండటంతో ఆయన మౌనంగా ఉన్నట్టు తెలుస్తోంది.మొత్తంమీద ఎవరూ ఊహించని సమయంలో జిల్లా విభజన తీసుకొచ్చి.. టీడీపీని ఎటూ తేల్చుకోలేని స్థితిలోకి సీఎం జగన్ పడేశారని పార్టీ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయట. పైకి నవ్వుతూ కనిపించినా.. నాలుగు గోడల మధ్య తమ రాజకీయ భవిష్యత్‌ను తలచుకుని టెన్షన్ పడుతున్నారట. మరి.. ఈ సమస్య నుంచి పెనుకొండ నేతలు ఎలా బయటపడతారో చూడాలి.

# కంచుకోటలో పట్టు కోసం యత్నాలు

విజయవాడ, ఫిబ్రవరి 21, )తెలుగు దేశం పార్టీ కంచుకోటలో వైసీపీజెండా ఎగిరింది. ఫ్యాను సుడిగాలిలో సైకిల్ పత్తా లేకుండాపోయింది. అధిపత్య పోరు, నాయకత్వ లోపంతో వర్గపోరు, గ్రూపు తగాదాలతో ప్రత్యర్థి పార్టీ గెలుపునకు దోహదం చేశాయి. జరిగిన నష్టాన్ని తెలుసుకొని అధిష్టానం కొత్త నేతను తెరపైకి తెచ్చి ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. వర్గపోరు ఆ నేతకు తప్పడం లేదా.. సవాళ్ళ మధ్య పసుపు జెండా ఎగురుతుందా.. అన్న నందమూరి తారక రామారావు సొంత జిల్లాలో మళ్లీ పార్టీ మనుగడ సాగిస్తుందా అనేది సగటు రాజకీయవేత్తను వేధిస్తున్న ప్రశ్న.కృష్ణా జిల్లా తెలుగు దేశంపార్టీకి బలమైన ఓటు బ్యాంకుతో కంచుకోటగా ఉన్న జిల్లా.. అలాంటి జిల్లాలో నేతల వర్గపోరుతో పార్టీ కార్యకర్తలు చతికిలాపడ్డారు.. స్వయం కృతాపరాధంతో గత ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతింది.. జిల్లాలో తెలుగుదేశంకు ఎన్నుదన్నుగా నిలిచిన నియోజకవర్గం తిరువూరు.. ఆ నియోజకవర్గంలో 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ ఎమ్మెల్యేగా రక్షణ నిధి గెలుపొందారు.. బలమైన ఓటు బ్యాంకు ఉన్నా.. నేతల వర్గపోరు,సరైన ప్రణాలిక లేకపోవడం.. ప్రత్యర్థి పార్టీకి కలిసి వచ్చాయి.తిరువూరు టీడీపీ ఎమ్మెల్యేగా నల్లగట్ల స్వామిదాసు రెండుసార్లు గెలుపొందారు.. అతని భార్య నల్లగట్ల సుధారాణి కృష్ణా జెడ్పీ ఛైర్ పర్సన్ గా కూడా పని చేశారు. 2004, 2009, 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున టికెట్ ఇచ్చినా స్వామిదాసుకు అదృష్టం కలసి రాలేదు. మూడు సార్లు ఓటమి పాలయ్యారు. నియోజకవర్గంలో టీడీపీకి బలమైన క్యాడర్, ఓటు బ్యాంకు ఉన్నా.. కొన్ని వర్గాల సహకారం లేకపోవడం.. నేతల గ్రూపు తగాదాలతో ఓటమి పాలయ్యారని చర్చ జరుగుతోంది.. స్వామిదాసు వ్యవహార శైలి ,యాక్టివ్ గా ఉండకపోవడం.. సీనియర్ నేతలను కలుపుకుని పోకపోవడం వంటి కారణాలు.. ఓటమికి దారి తీశాయని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి..మూడుసార్లు హ్యాట్రిక్ ఓటమితో.. స్వామిదాసును పక్కన పెట్టింది తెలుగు దేశం పార్టీ అధిష్టానం. 2019 ఎన్నికల్లో మాజీమంత్రి జవహర్‌కు కొవ్వూరు నియోజకవర్గంలో టికెట్ ఇవ్వకుండా.. ఆఖరి నిమిషంలో.. హడావుడిగా జవహర్‌ను తిరువూరు నియోజకవర్గంలో పోటీ చేయించింది. ఈ ప్రయోగం కూడా.. సక్సస్ కాలేదు. ఎన్నికలు సమీపిస్తున్నా.. చివరి వరకు అభ్యర్థి ఎవరో టీడీపీ ప్రకటించలేకపోయింది. జవహర్‌కు కొవ్వూరు నుంచి.. తిరువూరుకు మార్చడం.. ప్రచారం.. ప్రణాలిక రూపొందించడంలో సమయం సరిపోలేదని.. ఓటమికి కారణం అయ్యిందని అతని అనుచరులు అంటున్నారు. మరోవైపు నాన్ లోకల్ అయిన జవహర్‌కు స్వామిదాసు వర్గం సహకరించలేదనే ఆరోపణలు ఉన్నాయి.ఇదిలావుంటే, తాజాగా స్వామిదాసు, జవహర్‌ను పక్కన పెట్టి.. అనూహ్యంగా కొత్త నేత దేవదత్‌ను తెరపైకి తెచ్చింది టీడీపీ అధిష్టానం. అతన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు టీడీపీ అధినేత చంద్రబాబు.

# టీడీపికి దూరమవుతున్న కేడర్

గుంటూరు, ఫిబ్రవరి 21, గుంటూరు జిల్లాలో టీడీపీ స్ట్రాంగ్‌గా ఉండే నియోజకవర్గాల్లో సిటీలోని పశ్చిమ సెగ్మెంట్ ఒకటి. దీంతోపాటు గుంటూరు నగరంలోనే ఉండే మరో నియోజకవర్గం ఈస్ట్. ఈ రెండుచోట్లా ప్రజా సమస్యలపై ప్రస్తుతం గట్టిగా పోరాడే నాయకులు లేరు. తూర్పులో పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు పట్టుమని పదిమంది రావడం లేదు. ఎప్పుడేం చేసినా ఒకటే ముఖాలు కనిపిస్తాయి. టీడీపీ ప్రోగ్రామ్స్‌లో పాల్గొనలేని బిజీ ఆర్టిస్ట్‌లకు పదవులు కట్టబెట్టి.. పార్టీని నిర్వీర్యం చేశారన్నది తమ్ముళ్ల ఆవేదన. దీంతో ఎప్పటి నుంచో ఉన్న బలమైన క్యాడర్‌ను దూరమైంది.వార్డు కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిన నేతలు సైతం ప్రస్తుతం టీడీపీలో కనిపించడం లేదు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో వ్యక్తిగత అజెండాతో టికెట్లు ఇచ్చారని.. పార్టీని నమ్ముకుని ఉన్న వాళ్లు సైలెంట్ అయ్యారు. జరుగుతున్న పరిణామాలు రుచించక మాజీ ఎంపీ లాల్‌జాన్ పాషా కుటుంబం పార్టీకి దూరం జరిగింది. ఫలితంగా తూర్పు నియోజకవర్గంలోని డివిజన్లలో టీడీపీకి ఓటమి తప్పలేదు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలో గెలిచిన నేతలు పార్టీ మారినా.. టీడీపీ చెక్కు చెదరలేదనే అభిప్రాయం తమ్ముళ్లలో ఉంది.2019 సాధారణ ఎన్నికల్లో గుంటూరు పశ్చిమతోపాటు గుంటూరు ఎంపీ సీటును టీడీపీ గెల్చుకుంది. ఆ తర్వాత గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే వైసీపీకి జైకొట్టారు. ప్రస్తుతం పార్టీలో బలమైన నాయకులు లేకపోవడంతో కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాల్లో పది డివిజన్లను టీడీపీ గెల్చుకోలేకపోయింది. ఇందుకు నాయకత్వ సమస్యే అన్నది కేడర్ చెప్పేమాట. సమర్థ నాయకత్వాన్ని అందించడంలో పార్టీ వైఫల్యం చెందిందా? అనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీంతో కార్పొరేటర్లను.. పక్కపార్టీల నుంచి వచ్చిన నాయకులను ఇంఛార్జ్‌లుగా పెట్టుకుని టీడీపీ కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి ఉంది.గుంటూరు పశ్చిమలో కార్పొరేటర్ నాని టీడీపీ ఇంఛార్జ్. స్వతంత్రంగా పోరాడలేరని.. ప్రభుత్వంపై గట్టిగా మాట్లాడలేరని నానిపై ముద్ర పడింది. పైగా ఆయన అన్ని పార్టీలతో ఫ్రెండ్‌షిప్ చేస్తారని ప్రచారం ఉంది. ఇప్పటికే నలుగురైదుగురు ఆశావహులు గుంటూరు వెస్ట్‌లో రెడీ అయ్యారు. ఎవరికి వారు పార్టీ తమకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ప్రచారం చేసేసుకుంటున్నారట. అయితే ఆ ప్రచారాన్ని తెలుగు తమ్ముళ్లు నమ్మే పరిస్థితి లేదు. అలా అని ఉన్న ఇంఛార్జ్‌తో పార్టీకి భవిష్యత్ లేదన్నది వారి ఆవేదనప్రభుత్వంపై పోరాటం చేయలేని వాళ్లు.. టికెట్ ఇస్తే ఇండియాలో లేదా విదేశాలకు వెళ్లిపోయే వాళ్లు టీడీపీని ఎలా కాపాడతారని తమ్ముళ్ల ప్రశ్న. ఇప్పటికే గుంటూరు టీడీపీకి ఎంతో ఇచ్చిందని.. ఇకపై సమర్థులైన నాయకులను ఇస్తే అండగా ఉంటామని కేడర్ చెబుతోందట. అయితే శ్రేణుల అభిప్రాయాన్ని టీడీపీ అధిష్ఠానం గౌరవిస్తుందా? లేక పాత రాగమే ఆలాపిస్తుందో చూడాలి.

# యదేచ్ఛగా కొనసాగుతున్న మైనింగ్

కడప, ఫిబ్రవరి 21,కడప జిల్లా జమ్మలమడుగులో అక్రమ మైనింగ్ యధేచ్ఛగా జరుగుతోంది. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్టు.. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య ఒప్పందం కుదిరిందట. దానిని ప్రశ్నించేవారే లేకపోవడంతో వాళ్లదే రాజ్యం. మధ్యలో ప్రభుత్వానికి చెందాల్సిన రాయల్టీని ఎగ్గొట్టేస్తున్నారు.జమ్మలమడుగుతోపాటు.. కర్నూలు జిల్లాలోని కోవెలకుంట్ల నియోజకవర్గాల్లో భూగర్భమంతా రాతిమయం కావడంతో గాలేరు-నగరి ప్రధాన కాలువ తవ్వినప్పుడు పెద్ద పెద్ద బండరాళ్లు బయటపడ్డాయి. గుట్టలు గుట్టలుగా పోగుపడ్డ ఆ బండరాళ్లను సొమ్ము చేసుకున్నారు ఒక నాయకుడు. గత ప్రభుత్వ హయాంలో అప్పట్లో జిల్లాకు చెందిన మంత్రి కంకర మిషన్ ఏర్పాటు చేసుకుని బండరాళ్లను కంకరగా మార్చుకుని అమ్మేసుకున్నారు. మారు మూల ప్రాంతం కావడంతో కరెంటు పెద్దగా ఉండదు. దాంతో మిషన్లకు జనరేటర్లను పెట్టుకుని కంకర క్రష్ చేసి సొమ్ము చేసుకున్నారు.అప్పట్లో ఆ మాజీ మంత్రి పార్టీ అధికారంలో ఉన్నన్నాళ్లూ గాలేరు-నగరి కాలువ పొడవునా తవ్వకంలో పోగుపడ్డ బండరాళ్ల క్రషింగ్ చేసేశారు. ప్రభుత్వ రికార్డుల్లో చూపించేందుకు మైలవరం మండలంలోని ఓ గ్రామ పరిధిలో కొంత కొండను మైనింగ్‌కు లీజుకు తీసుకున్నారట. ఆ విధంగా లెక్క సరిచేసినట్టు చెబుతారు. ఈలోగా రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. ఆ మాజీ మంత్రి ఓడి.. అధికారానికి దూరం అయ్యారు. అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే ఆ మాజీ మంత్రి ఆటలు సాగనివ్వలేదు. దీంతో ఆ మాజీ మంత్రి క్రషర్ మూతపడింది. ఈ బ్యాక్‌డ్రాప్‌లో కొన్నాళ్లు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో రాజకీయ విమర్శలు చేసుకున్నారు. కానీ.. కంకర కాసులు వారిని కలిపేశాయి.లక్షలు పోసి కొన్న మిషనరీ ఖాళీగా ఉండటంతో ఎమ్మెల్యేకి మాజీ మంత్రి ఓ ప్రతిపాదన చేశారు. ఆ ప్రతిపాదన నచ్చడంతో ఏడాది క్రితం ఒప్పందం జరిగిందట. అంతే తిట్టిపోసుకున్నవాళ్లు కాస్తా చేతులు కలిపారు. మాజీ మంత్రికి చెందిన క్రషర్ ఎమ్మెల్యే లీజుకు తీసుకునేందుకు అడ్వాన్స్‌గా 50 లక్షలు, నెలకు అద్దె 12 లక్షలుగా సెట్ చేసుకున్నారట. దీనిపై ప్రతిపక్షం మాట్లాడకూడదనే షరతు పెట్టుకున్నారట. డీల్ ఓకే కావడంతో క్రషర్ ఎమ్మెల్యే చేతికి వెళ్లింది. అక్రమ తవ్వకాలతో మైలవరం మండలంలోని ఉబొూ కాలువ రాళ్లు కరిగిపోతున్నాయి. గతంలో మాజీ మంత్రి చేసిన దానికంటే వేగంగా క్రషర్ ట్వంటీ ఫోర్ సెవన్ పనిచేస్తోందట. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ట్విస్ట్ ఏంటంటే.. శత్రువులుగా చూసుకున్న నాయకుల నోళ్లకు తాళాలు పడ్డాయి.. ప్రభుత్వానికి చేరాల్సిన రాయల్టీ ఎగ్గొట్టేశారు.

## ఏనుగు దాడిలో పశువులు మృతి

విజయనగరం విజయనగరం జిల్లా కొమరాడ మండలం గంగిరేగువలస గ్రామంలో పశువులపై ఒంటరి ఏనుగు దాడి చేసింది. ఆదివారం అర్ధరాత్రి గంగిరేగివలస గ్రామంలో నిద్రిస్తున్న ఆవులపై దాడి చేసింది. ఏనుగు దాడిలో రెండు ఆవులు మృతి చెందటంతో రైతులు, గ్రామస్తులు ఆందోళనలు చెందుతున్నారు.

## రోయ్యలు, చేపలు హోమ్ డెలివరీ

ఏలూరు, ఫిబ్రవరి 21, (న్యూస్ పల్స్) ఏపీలో ఇప్పటికే ఇంటి ముందుకే రేషన్ బియ్యం, సరుకులను మొబైల్ వాహనాలు ద్వారా అందిస్తున్న ప్రభుత్వం.. ఇకపై చేపలు, రొయ్యలను కూడా మొబైల్ వాహనాలు ద్వారా ఫిష్ ఆంధ్ర పేరుతో ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సిద్దమైంది. ఇందుకోసం ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 70 ఫిష్ హబ్‌లు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్దం చేసింది. ఒక్కో హబ్‌కు మత్స్య ఉత్పత్తుల యూనిట్లతో పాటు 14 వేల రిటైల్ అవుట్ లెట్లు, రిటైల్ వెండింగ్ ఫుడ్ కోర్టులు, మొబైల్ యూనిట్లు ఉండనున్నాయి. అయితే ఇప్పటి వరకు 56 హబ్‌లు సిద్దం చేసింది ప్రభుత్వం. వీటికి



అనుబంధంగా దుకాణాలు కూడా అందుబాటులోకి తెనున్నారు. ఇదే క్రమంలో ఈ కామర్స్ యాప్ ద్వారా కూడా మత్స్య ఉత్పత్తులు అమ్మకాలు చేపట్టాలని భావిస్తోంది. మొబైల్ వాహనాలు ద్వారా లైవ్ ఫిష్, రొయ్య అమ్మకాలకు కోసం లబ్దిదారుల ఎంపిక కూడా ప్రభుత్వం పూర్తి చేసింది. ప్రభుత్వం తలపెట్టిన ఫిష్ ఆంధ్ర వలన వినియోగ దారులతోపాటు.. రైతులకు లాభం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం మన దగ్గర ఉత్పత్తి అయ్యే చేపలు, రోయ్యలు దేశ, విదేశాల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. వేల కోట్ల ఎగుమతులు జరుగుతున్నాయి. అయితే ఇక్కడ ఎగుమతులను నాణ్యత పేరుతో లేదా ఇతర తనిఖీల పేరుతో అక్కడ తిరస్కరించడంతో రైతులు నష్టపోతున్నారు. కరోనాకాలంలో వివిధ దేశాలకు ఎగుమతులు నిలిచిపోవడం.. ఎగుమతులు చేసిన వాటికి కూడా ఇబ్బందులు రావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం..ఫిష్ ఆంధ్ర బ్రాండ్ ఏర్పాటు చేసి.. ఈ దిశగా ముందుకెళ్తుంది.రాష్ట్రంలో ప్రతి చోటా చికెన్, మటన్ షాపులు ఉన్నాయి. కానీ అదే స్థాయిలో చేపలు, రొయ్యలు షాపులు లేవు. చికెన్, మటన్ కంటే చేపలు చిన్నా, పెద్దలకు పూర్తి స్థాయిలో పోషక విలువలు అందించే ఫుడ్. ఇలా అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఇంటింటికి రేషన్, ఇతర ఈ కామర్స్ వస్తులు వలే.. త్వరలో చేపలు, రొయ్యలు కూడా అందుబాటులోకి రానున్నాయి. చేపలు,రోయ్యలను కూడా ప్రాసెసింగ్ చేసి మరీ అమ్మకాలు చేపట్టడంతో ప్రభుత్వం చేపట్టనున్న ఫిష్ ఆంధ్రకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

## నెల్లూరు జిల్లా విభజన అర్థ రహితం

**నెల్లూరు జిల్లా పరిరక్షణ సమితి**

ఆత్మకూరు నెల్లూరు జిల్లా విభజన అర్థరహితమని నెల్లూరు జిల్లా పరిరక్షణ సమితి పేర్కొంది. నెల్లూరు జిల్లా పరిధిలోని సోమశిల ప్రాంతంలో ఉన్న సోమశిల జలాశయంను పరిశీలించి తద్వారా తమ మనోభావాలను మీడియాకు వ్యక్తపరిచారు.13 జిల్లాలుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 26 జిల్లాలు ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. లోకసభ నియోజకవర్గాల ప్రాతిపదికన ఏకపక్షంగా జిల్లాల పునర్విభజన అర్థరహితమని నెల్లూరు జిల్లా పరిరక్షణ సమితి కన్వీనర్ సంజయ్ కుమార్ కె. తెలిపారు. ప్రజల మనోభీష్టంకు వ్యతిరేకంగా జిల్లాల విభజన మంచిది కాదని, అందరి సమిష్టి నిర్ణయంతో భౌగోళిక పరిస్థితులు, సాగునీటి పరిస్థితులు ఆధారంగా విభజన జరగాలని కోరారు. జిల్లా విభజన వల్ల నెల్లూరు ప్రాంతం పూర్తిగా నష్టపోతుందని, తిరుపతి జిల్లా వద్ద ఆర్థిక కేంద్రీకరణ జరుగుతుందని ,తద్వారా నెల్లూరు ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతారని తెలిపారు. నెల్లూరు జిల్లా విభజన వల్ల సోమశిల పరివాహక ప్రాంతాలు తీవ్ర విభేదాలు నెలకొనే పరిస్థితి ఉందని తెలిపారు. కలువాయి చేజర్ల ఆత్మకూరు , రాపూరు, పొదలకూరు మండలాలలో జలవిభేదాలు నెలకొనే ప్రమాదం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను ఒక యూనిట్గా తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. నెల్లూరు జిల్లా తీర ప్రాంత విభజన వల్ల రాయలసీమ రాష్ట్ర నినాదాలకు ఆజ్యం పోసినట్లుగా ఉందని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన విభజన వాదం నెల్లూరు ప్రజలకు నిద్రలేకుండా చేసిందని,ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ సుధాకర్ పి , వనం శ్రీ రాములు, కళ్యాణ్ సుందర్, వీర, వనం గిరి తదితరులు పాల్గొన్నారు.

## మొహం చాటేసిన ప్రియుడిని చితకబాదిన ప్రేయసి

కర్నూలు కర్నూలు జిల్లాలో ఓ యువతి తనను మోసం చేసి ప్రియుడికి గుణపాఠం చెప్పింది. కల్లూరు మండలం పెద్ద టెకూరుకు చెందిన యువకుడు అదే ఊరికి చెందిన యువతిని ప్రేమించాడు. కొద్దిరోజులుగా ప్రియురాలికి కనిపించకుండా మొహం చాటేశాడు. తర్వాత కనిపిస్తే తనను పెళ్లి చేసుకోమని అడిగితే కులాలు వేరు కావడంతో తమ ఇంట్లో ఒప్పుకోవడం లేదన్నాడు. దీంతో ఆగ్రహించిన యువతి ప్రియుడ్ని పట్టుకుని నిలదీసింది. గ్రామంలో అందరు జనాల ముందే పట్టుకుని కొట్టింది.తనను ఎందుకు మోసం చేశావని పట్టుకుని నిలదీసింది. తన మెడలో తాళి కట్టి పెళ్లి చేసుకోవాలని మళ్లీ ప్రియుడ్ని అడిగింది. అతడు మాత్రం ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో కట్టే తీసుకొచ్చి చితకబాదింది. స్థానికులు కొందరు ఘటనను మొబైల్‌లో రికార్డు చేశారు. తర్వాత సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఈ ఘటన ఆలస్యంగా బయటపడింది. బాధిత యువతికి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా.. పోలీసులు కూడా స్పందించాల్సి ఉంది.

## గౌతమ్ రెడ్డి మృతి రాష్ట్రానికి తీరని లోటు

**నెల్లూరు ఎంపీ ఆదాల**

నెల్లూరు యువనేత, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మృతి జిల్లాకే కాదు రాష్ట్రానికి తీరని లోటని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైసీపీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ్ రెడ్డి తనకు చిన్నప్పటి నుంచి తెలుసునని, ఆయన రాజకీయాలకు వస్తాడని అనుకోలేదని అన్నారు. వచ్చిన తర్వాత ఒక క్రమ పద్ధతిలో పనిచేస్తూ రాజకీయాల్లో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. సౌమ్యుడు, అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం కలిగిన వ్యక్తి గౌతమ్ రెడ్డి అని కితాబునిచ్చారు. జిల్లాకు, రాష్ట్రానికి పరిశ్రమలను తెచ్చేందుకు అవిరళ కృషి చేస్తున్నారని, ఇంతలోనే అకాల మృత్యువు ఆయనను తీసుకు వెళ్ళిందని ఆవేదనను వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం కూడా తనతో మాట్లాడారని, ఎంతో ఉల్లాసంగా ఉన్నారని, ఇంతలోనే ఆయన మృతి వార్త రావడంతోగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు

# బీజేపీతో చేతులు కలిపితే లాలూను హరిశ్చంద్ర అనేవారు: తేజస్వి యాదవ్



పాట్నా: బీజేపీతో చేతులు కలిపి ఉంటే లాలూజీని రాజా హరిశ్చంద్ర అనేవారని ఆయన కుమారుడు, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. పశు దాణా కుంభకోణానికి సంబంధించిన ఐదో కేసులో రాంచీ సీబీఐ కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఐదేండ్ల జైలు శిక్షతోపాటు రూ.60 లక్షల జరిమానా విధించింది.

ఈ తీర్పుపై లాలూ చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ స్పందించారు. లాలూజీ బీజేపీతో చేతులు కలిపి ఉంటే రాజా హరిశ్చంద్ర అని పిలిచేవారని ఎద్దేవా చేశారు. అయితే ఆయన నేడు ఆర్ఎస్ఎస్, బీజేపీపై పోరాడుతున్నారని, అందుకే జైలు శిక్ష అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే దీనికి తాము భయపడబోమని అన్నారు.దేశంలో దాణా కుంభకోణం తప్ప మరే స్కామ్ జరుగలేదా అని తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. బీహార్‌లో దాదాపు 80 కుంభకోణాలు జరిగాయని, కానీ సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ ఎక్కడ ఉన్నాయి, వాటికి ఎందుకు పట్టలేదు అని నిలదీశారు. దేశంలో ఒకే ఒక స్కామ్, ఒక్క నాయకుడిపైనే దర్యాప్తు సంస్థలు దృష్టిపెట్టాయని విమర్శించారు. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలను సీబీఐ మరిచిపోయిందని ఆయన ఆరోపించారు.కాగా, కోర్టు తీర్పుపై తాను వ్యాఖ్యానించబోనని తేజస్వి యాదవ్ అన్నారు. అయితే ఇదే చివరి తీర్పు కాదన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఉన్నాయని, ఉన్నత న్యాయస్థానాల్లో తాము సవాల్ చేస్తామని తెలిపారు. దిగువ కోర్టు ఇచ్చిన తీర్పుపై హైకోర్టులో ఊరట లభిస్తుందని తాము ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు.

# రెండు రోజులు సంతాప దినాలు

విజయవాడ, ఫిబ్రవరి 22 మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మరణం నేపథ్యంలో రెండు రోజుల పాటు రాష్ట్రంలో సంతాప దినాలను పాటించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అటు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో తెలిపింది. బుధవారం నాడు మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అంత్యక్రియలు జరగనున్నట్లు సమాచారం.అటు మంత్రి గౌతమ్ రెడ్డి మృతికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ అపోలో ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. సోమవారం ఉదయం గౌతమ్ రెడ్డి తన ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయారని తెలిపారు. ఉదయం 7.45 గంటలకు ఆస్పత్రికి తీసుకొచ్చారని? కార్డియాక్ అరెస్టు రావడం వల్ల ఊపిరి తీసుకోలేకపోయారని పేర్కొన్నారు. 90 నిమిషాల పాటు అఖఖీ చేశామని? అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్‌పై ఉంచామని.. అయినా ఆయన ప్రాణాలు దక్కలేదని ప్రకటించారు. సోమవారం ఉదయం 9:16 గంటలకు గౌతమ్‌రెడ్డి మరణించారని వారు తెలిపారు.బుధవారం అంత్యక్రియలు మంగళవాం ఉదయం ఎయిర్ అంబులెన్స్‌లో గౌతమ్‌రెడ్డి భౌతికకాయాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.. నెల్లూరులో ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచనున్నారు.. ఇక, బుధవారం ఉదయం నెల్లూరు నుంచి బ్రాహ్మణపల్లికి అంతిమయాత్ర సాగనుండగా.. మధ్యాహ్నం బ్రాహ్మణపల్లిలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.. గౌతమ్‌రెడ్డి అంత్యక్రియల్లో సీఎం వైఎస్ జగన్ పాల్గొననున్నారు.. ఉదయం స్వగ్రామంలో అంతిమ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి.. గౌతమ్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన ఆయన.. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ కుటుంబంతో అత్యంత సన్నిహితంగా ఉండేవారు మేకపాటి గౌతమ్‌రెడ్డి అని గుర్తుచేశారు.. సీఎం జగన్‌తో అత్యంత సన్నిహితుడుగా ఉన్నారని.. ఈరోజు అయన లేరు అని విషయాన్ని నమ్మలేకపోతున్నాం అన్నారు. స్వగ్రామంలో అంతిమ కార్యక్రమాలు జరుగుతాయని.. తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం ఇస్తామని తెలిపిందన్నారు సజ్జల రామకృష్ణారెడ్డి.

# సమ్మర్ స్టోరేజీ నీటి నిల్వ ఉన్న ట్యాంకును పరిశీలించిన సిపిఐ బృందం..

నంద్యాల ఫిబ్రవరి 21 నంద్యాల పట్టణంలోని చెరువు కట్ట దగ్గర ఉన్న సమ్మర్ స్టోరేజ్ లో ఉన్న నీటిమట్టాన్ని పరిశీలించడం జరిగింది. అని సిపిఐ పట్టణ ప్రధాన కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ షరీఫ్ భాష సిపిఐ మహానంది మండల కార్యదర్శి ఆర్ సామెల్ సిపిఐ సలీం నగర్ శాఖ కార్యదర్శి భూమని శ్రీనివాసులు బైటిపేట సిపిఐ శాఖ సహాయ కార్యదర్శి నాగరాజు తెలిపారు.అనంతరం పై నాయకులు మాట్లాడుతూ, నంద్యాల పట్టణ ప్రజలు ఈ వేసవి కాలం మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని అన్నారు. ఎందుకంటే వేసవి కాలం మొదలు కాకముందే మంచి నీటిని విలువచేసే సమ్మర్ స్టోరేజ్ లో ఇప్పటికే రెండు అడుగుల మేరకు నీటి మట్టం తగ్గడం జరిగింది. అక్కడ ఉన్న మంచి నీటి నిల్వలు పట్టణ ప్రజలకు ఏ మాత్రం సరిపోవు అని అన్నారు.వీలైనంత త్వరగా వెలుగోడు నుండి తీసుకు వస్తున్నా పైపులైను త్వరగా పూర్తిచేసి అధికారులు పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని అన్నారు.మరోవైపు ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గింది. ప్రతి సంవత్సరము అధికారుల ముందుచూపు లేని వల్ల పట్టణ ప్రజలు మంచినీటికి అనేక ఇబ్బందులు పడుతూ ఉంటారు.ఇప్పటికైనా అధికారులు నీటి నిల్వలు పెంచి పట్టణ ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చూడాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి గా తెలియజేయడం జరుగుతుంది.

# జిల్లా విభజనతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోనున్న సింహపురీయులు

**-నెల్లూరు జిల్లా పరిరక్షణ సమితి**

నెల్లూరు జిల్లాల విభజనలో భాగంగా నెల్లూరు జిల్లా ప్రజలు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయే పరిస్థితి రానుందని నెల్లూరు జిల్లా పరిరక్షణ సమితి పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు.నెల్లూరు జిల్లా పార్లమెంటు మెంబర్ అయిన ఆదాల ప్రభాకర్ రెడ్డిని నెల్లూరు జిల్లా పరిరక్షణ సమితి కన్వీనర్ సంజయ్ కుమార్ కె .ఆధ్వర్యంలో సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విభజన వలన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోవడమే కాక తీర ప్రాంతం, షార్ ,పులికాట్, నేలపట్టు, సెజ్ లు, రైల్వే జంక్షన్. కోల్పోతారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డికి నెల్లూరు జిల్లా విభజన ప్రక్రియ పై ప్రభుత్వం చేపడుతున్న అశాస్త్రీయ విభజన వలన రానున్న రోజుల్లో జిల్లా విభజన ప్రక్రియ జరిగితే జరగబోయేటువంటి నష్టాలను వినతిపత్రం ద్వారా అందించడం జరిగింది. తీర ప్రాంతం విభజన వల్ల ప్రత్యేక రాయలసీమ ప్రాంత నినాదాలు వల్ల మళ్ళా రాష్ట్రంలో సంక్షోభం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అంతేకాకుండా నెల్లూరు జిల్లా యొక్క సహజ వనరులు ఇక్కడ ఉన్నటువంటి ప్రజలు కోల్పోతారని, జల జగడాలు జరుగుతాయని వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆదాల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్య పై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లాయర్ గూడూరు సుబ్బారెడ్డి , కో కన్వీనర్ సుధాకర్ ,వనం పౌండేషన్ శ్రీరాములు , దీపక్ చార్లీ క్రాంతి గౌరవ్ వనం గిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కొత్తగా బస్సులు..?



హైదరాబాద్, ఫిబ్రవరి 21, (న్యూస్ పల్స్)తెలంగాణ ఆర్టీసీ ఇప్పటికే పలు ప్రయోగాలతో ప్రజలకు చేరువైంది. తాజాగా మరో ప్లాన్ సిద్ధం చేసింది. ఈ ప్రణాళికతో సేవలు విస్తృతం చేసి, లాభాలు పెంచుకోవచ్చని టీఎస్ఆర్టీసీ భావిస్తోంది. ఆర్టీసీ నష్టాల్లో ఉందని తరుచూ వింటుంటాం. ఆ నష్టాలను పూడ్చుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసింది ఆర్టీసీ. కానీ ఇప్పటికీ లాభాల బాట పట్టలేదు. ఎండీ సజ్జనార్ సైతం సరికొత్త పంథాతో ఆర్టీసీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో టీఎస్ ఆర్టీసీ మరో ప్లాన్ రెడీ చేసింది. అదే కొత్త బస్సుల ప్లాన్. తెలంగాణలో త్వరలో కొత్త బస్సులు తిరగనున్నాయి. దీనికి సంబంధించి ప్రతిపాదనను ఆర్టీసీ సిద్ధం చేస్తోంది. కొత్త పంథాలో ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్న ఆర్టీసీ , ప్రజలను ఆకట్టుకునేందుకు టెక్నాలజీని వాడుతుంది. ఇందులో భాగంగానే కొత్త బస్సులను కొనేందుకు ప్రతిపాదనలు రెడీ చేస్తుంది. ప్రజలను తమవైపు తిప్పుకునేందుకు వచ్చిన ప్రతీ అవకాశాన్ని ఆర్టీసీ అందిపుచ్చుకుంటూ దూసుకెళ్తోంది.మేడారం జాతర కూడా అందులో భాగమే. గతం కంటే ఎక్కువగా బస్సులను మేడారానికి నడిపింది తెలంగాణ ఆర్టీసీ. దాదాపు 3వేల 800 బస్సుల్లో దాదాపు18 లక్షల మందిని మేడారానికి చేరవేసింది. మొక్కులు చెల్లించలేని వారికోసం కార్గో సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను క్రియేట్ చేసి అందుబాటులోకి తెచ్చింది. కానీ ఆశించిన ఫలితం రాలేదన్నారు తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్. గతంలో జరిగిన మేడారం జాతరతో ఆర్టీసీకి 38 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని, ఇప్పుడు మాత్రం ఆదాయం తగ్గింది అని ప్రాథమిక అంచనా. అందుకే తెలంగాణ ఆర్టీసీ ఎదుగుదల కోసం ప్రభుత్వానికి పంపడానికి కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు బాజిరెడ్డి.2 వేల 820 బస్సులు కొనాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కు వివరించనున్నట్టు వెల్లడించారు గోవర్ధన్‌రెడ్డి. అలాగే, మృతిచెందిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకం ద్వారా, ఉద్యోగం కల్పించే అంశాన్ని ప్రస్తావిస్తామని చెప్పారాయన. అటు రిటైర్మెంట్ బెనిఫిట్లకు కూడా 500 కోట్లు ప్రభుత్వం సాయం చేయాలని ఆర్టీసీ చైర్మన్ కోరనున్నారు.

## చిన్నపిల్లల మానసిక ఆరోగ్యానికి మాతృభాషకు ముడిపడి ఉంది

**జెడి ఫౌండేషన్ కన్వీనర్ మాకినేని అరుణ**

నెల్లూరు చిన్న పిల్లల మానసిక ఆరోగ్యానికి వారి మాతృభాషతో ఉండే అనుబంధానికి సంబంధం ఉంటుందని జెడి పౌండేషన్ కన్వీనర్ మాకి అని అరుణ పేర్కొన్నారు. జె.డి.ఫౌండేషన్ మరియు శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అల్లూరు లోని రామకృష్ణ డిగ్రీ కాలేజ్ నందు "తెలుగు-వెలుగు" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జె.డి.ఫౌండేషన్ కన్వీనర్ మాకినేని అరుణ మాట్లాడుతూ మాతృభాషలో మాట్లాడేటప్పుడు మనస్సు-మెదడు- నాలుక మధ్య సంబంధం ఉందని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎమ్. రామ్మూర్తి మాట్లాడుతూ పిల్లలు పసిప్రాయంలో మాతృభాష ద్వారా నేర్చుకోవడం మొదలు పెట్టి, తరువాత మరో భాష నేర్చుకుంటే వారి విద్యా జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ రాజు చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి మురళీ మోహన్ రాజు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పరశురాం, మోటివేటర్ మాలకొండారెడ్డి, జంద్యాల సుమతి, రవి గోగులపల్లి, పుట్టా మస్తాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ గుగులోత్ రవి**

**ప్రజావాణిలో వివిధ సమస్యలపై పలువురు వినతులు**

జగిత్యాల ఫిబ్రవరి 21 ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా వాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హోల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ , జిల్లాస్థాయి ఉన్నత అధికారులకు వినతులు అందించారు. ప్రజావాణి కార్యక్రమానికివివిధ మండలాల నుండి 10 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్నికరోనా తీవ్రత దృష్ట్యా రద్దు చేసి ప్రస్తుతం మళ్లీ ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బిఎస్ లత, జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గౌతమ్ రెడ్డి మృతి పట్ల ఆవేదన చెందిన బద్వేల్ ప్రజలు

బద్వేలు రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమి రెడ్డి మృతి పట్ల బద్వేల్ ప్రాంత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు మంత్రి గౌతమ్ రెడ్డి స్వగ్రామం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లె బద్వేలు కు కేవలం 30 కిలోమీటర్ల దూరం ఉంటుంది ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు బద్వేలు తో మంచి సంబంధాలు గత కొన్ని దశాబ్దాలుగా ఉన్నాయి మేకపాటి కుటుంబానికి కూడా ఎంతో కాలంగా రాజకీయంగా ప్రజలతో మంచి సంబంధాలు ఉండడం గమనార్హం మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి మృతి చెందిన విషయం తెలుసుకుని బద్వేల్ ప్రాంత ప్రజలు తల్లడిల్లిపోయారు చిన్న వయసులోనే ఆయన గుండెపోటుతో మృతి చెందడం అత్యంత బాధాకరమని ఈ ప్రాంత ప్రజలు తల్లడిల్లి పోయారు

## అమలాపురంలో అధికారులు, వ్యాపారులు మధ్య ఉద్రిక్తత

**అధికారుల కాళ్ళు పట్టుకున్న వ్యాపారులు**

అమలాపురం అమలాపురం బస్టాండ్ దగ్గర పళ్ళ వ్యాపారాలను మునిసిపల్ అధికారులు సోమవారం ఉదయం తొలగించారు. దాంతో వ్యాపారులు మునిసిపల్ అధికారుల కాళ్లపై పడి అడ్డుకున్నారు. అయినా అధికారులు వినలేదు. 40 సంవత్సరలనుండి ఇక్కడే బ్రతుకుతున్నాం. ఈరోజు నుండి మేము ఎలా బ్రతకాలి మహా ప్రభో అని వాపోయారు. ప్రత్యామ్నాయం చూపించకుండాఅధికారులు పేదోడి పొట్ట కొడుతున్నారని వారన్నారు. మా జీవనం ఎలా సాగించాలి అంటూ లబోదిబోమంటున్నారు. చివరకు జేసీబీలతో వ్యాపారుల కట్టడాలను కూల్చేసారు.

## 11 రోజుల పాటు శ్రీ శైల బ్రహ్మోత్సవాలు

కర్నూలు, ఫిబ్రవరి 22, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్లోని ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలం శివరాత్రికి ముస్తాబవుతోంది. భ్రమరాంబామల్లికార్జున స్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 22వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకూ 11 రోజుల పాటు మల్లన్న బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మహాశివరాత్రికి, బ్రహ్మోత్సవాలకు తరలి వచ్చే భక్తులు దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం అధికారులు ఆన్ లైన్ లో టికెట్ బుకింగ్ సౌకర్యాన్ని తీసుకొచ్చారు. ఈ నెల 22 నుంచి మార్చి 4వ తేదీ వరకు మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులు ఆన్ లైన్ లో టికెట్లను బుక్ చేసుకోవచ్చని ఈవో లవన్న సూచించారు. ఆన్ లైన్ లో రూ. 200 శీఘ్రదర్శనం, రూ.500 అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. శీఘ్ర దర్శనం టికెట్లు రోజులు ఐదు వేలు అందుబాటులో ఉండగా.. అతి శీఘ్ర దర్శనం టికెట్లు రెండు వేలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు (ఫిబ్రవరి 21వ తేదీ) 9 గంటలకు అంకురార్పణ చేయనున్నారు. ఈ నెల 23 నుంచి స్వామి అమ్మవార్లకు వాహన సేవలు, గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కరోనా నిబంధనలను పాటిస్తూ.. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## గౌతమ్ రెడ్డి మృతి వైస్సార్ పార్టీ కి తీరని లోటు

**- మంత్రి వెలంపల్లి**

పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి నా సహచరులు మరణం నన్ను కలచివేస్తుందని దేవాదాయ శాఖ మంత్రీ వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. గౌతమ్ రెడ్డి లాంటి యువ నాయకుడు ఇక లేరు అనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ కు ఎంతో , సన్నిహితుడైన గౌతమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక, నైపుణ్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి విశేషంగా పెట్టుబడులు, మంచి పేరు ప్రఖ్యాతులు, అవార్డులు తీసుకు రావడానికి విశేషమైన కృషి చేశారన్నారు ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన

## నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



నంద్యాల ఫిబ్రవరి 21( విభారె) :-స్పందన కార్యక్రమానికి 24 వినతులు అందినాయి అని నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు.సోమవారం నంద్యాల సబ్ కలెక్టర్ కార్యాలయం లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమము నిర్వహించారు ఈకార్యక్రమం లో నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్. సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి హరినాథ్ రావు . మహానంది డిప్యూటీ తహసీల్దార్ నారాయణ రెడ్డి .లతోకలసి వినతిదారుల నుండి వినతులు స్వీకరించారు.అనంతరం సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో విన్నవించే విన్న తులలో విన్నతి దారుల ఆధార్ కార్డు నెంబరు మరియు సెల్ ఫోన్ నెంబర్లు ఖచ్చితంగా నమోదు చేయాలి అని అన్నారుసోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కోవిడ్ నిబంధనలు పాటించుతూ వినతిదారుల నుండి వినతులు స్వీకరించినామని అన్నారు. వినతి దారులకు ముఖ్యంగా తెలియజేయడమేమనగా మీ పరిధిలోని సచివాలయం నందు మరియు మండల తహశీల్దార్ వారి కార్యాలయం నందు కూడా వినతులు స్వీకరించబడతాయి అక్కడ పరిష్కారం దొరకనప్పుడు మాత్రమే డివిజన్ లోని సబ్ కలెక్టర్ కార్యాలయం నకు రావాలన్నారు .సిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామం నివాసి ఏ. లక్ష్మిదేవి బోయలకుంట్ల గ్రామ పొలిమేరలో సర్వే నెంబర్ 514 లో5.77 ఎకరాల విస్తీర్ణం గల భూమి లో 2005 సంవత్సరం ఏప్రిల్ మాసం 29వ తారీకున 2.69 ఎకరాల భూమి నా పేరు మీద రిజిస్ట్రేషన్ అయినది పట్టా కూడా ఉన్నది కానీ గ్రామ వి ఆర్ ఓ ఆన్లైన్లో నమోదు చేయడం లేదు దయతో న్యాయం చేయండి.నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామనివాసి బాలకృష్ణ మా గ్రామంలో స్మశాన వాటికకు గాను 0.25 సెంట్లు మాత్రమే ఉన్నది గ్రామ జనాభా 6000 ఉన్నారు స్మశాన వాటికకు స్థలం సరిపోవడం లేదు దయతో మా గ్రామానికి స్మశాన వాటికకు గాను రెండు ఎకరాల స్థలం కేటాయించ గలరు అని కోరినారు .నంద్యాల మండలం నందమూరినగర్ నివాసి ఎం . జైనాబి. మూలసాగరం రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబర్193/2 లో ని ప్లాట్ నెంబర్ 188 నా తండ్రి మహమ్మద్ సెట్ 1996లో జూలై మాసం ఆరవ తేదీన నిజాముద్దీన్ దగ్గర కొనుగోలు చేసినారు నా పేరు మీద 2010వ సంవత్సరం నవంబర్ నెలలో నేను పట్టాకు దరఖాస్తు చేశాను కానీ ఆ పట్టాను క్యాన్సిలేషన్ చేశాము అంటున్నారు ఆన్లైన్లో కూడా నమోదు చేయించి నఖల్ పట్టా ఇప్పించగలరు. అని కోరినారు. కార్యక్రమానికి ఎక్కువ శాతం భూ తగాదాల గురించి. భూములను ఆన్లైన్లో నమోదు చేయించాలని. భూములను ఆక్రమించుకున్నారని. భూములను కొలతలు వేయించి అడంగల్ నందు భూముల వివరాలు నమోదు చేయాలని. స్మశాన వాటిక కు స్థలం కేటాయించాలని .తదితర వినతులు అందినాయి అన్నారు. ఈరోజు జరిగిన స్పందన కార్యక్రమాని కి 24 వినతులు అందినాయని అన్నారు.ఈ కార్యక్రమంలో . సబ్ కలెక్టర్ కార్యాలయం ఏ ఎస్ ఓ . ఆచారి . రవీంద్రపాల్ .డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయము సిబ్బంది. సి డి పి ఓ.చంద్రకళ. మరియు కార్యాలయ సిబ్బంది. డి ఆర్ డి ఎ అసిస్టెంట్ మేనేజర్ బాబురావు . మున్సిపల్ కార్యాలయ సిబ్బంది. ఆర్డబ్ల్యూఎస్. బి నబిరసూల్. ఎస్ ఆర్ బి సి .జ్యోతి . లైబ్రేరియన్ బషీర్ అహ్మద్ .హరీశ్ .తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీటీఎఫ్ సతీష్ కుమార్ ను సర్వీస్ నుండి రిమూవ్ చేయాలి

## కడపలో ఆర్జేడీ వెంకట కృష్ణా రెడ్డి గారికి విద్యార్థి సంఘాల నేతలు ఫిర్యాదు



నంద్యాలఫిబ్రవరి 21( విభారె) :- వివాదాలకు కేరాఫ్ అడ్రస్ బీటీఎఫ్ సతీష్ కుమార్ ను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగం చేయకుండా అక్రమంగా సమాచార చట్టాలు , ఆర్.టీ.ఐ యాక్ట్ ల పేరుతో తోటి ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్న బీటీఎఫ్ సతీష్ కుమార్పు. భుత్వ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన బీటీఎఫ్ సతీష్ కుమార్ ఓడీలు వేసుకొని , పాఠశాలకు దుమ్మా కొడుతూ , ఈయననే విచారణకు హాజరై రాక్షసానందం పొందుతున్నాడు ప్రభుత్వ ధనాన్ని , ప్రభుత్వ విధులను దుర్వినియోగం చేస్తున్న బీటీఎఫ్ సతీష్ కుమార్ పై విచారణ కమిటీ వేసి ఉద్యోగం నుండి రిమూవ్ చేయాలని కోరారు. ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న వ్యక్తి ఏరకంగా వాట్సాప్ మెసేజ్ లు , అధికారులకు వ్యతిరేఖంగా ధర్నాలు , ఆందోళనలు ఎలా చేస్తారు.బీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు , సమాచార హక్కు చట్టాల పేరుతో ఉపాధ్యాయులను , తోటి ఉద్యోగులను ఎన్నో సంవత్సరాల నుండి వేధింపులకు గురిచేస్తూ , ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కొనసాగుతూ విద్యార్థులకు చదువు చెప్పకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సతీష్ కుమార్ పై పూర్తి విచారణ నిర్వహించి ఈయనను సర్వీస్ నుండి రిమూవ్ చేయాలని కోరుతూ సోమవారం ఏ.ఐ.ఎస్.ఎఫ్ , ఏ.ఐ.ఎఫ్.బి , పీ.డీ.ఎస్.యు , ఎన్.ఎస్.యూ.ఐ , బీసీ - ఎస్సీ - ఎస్టీ - మైనారిటీ విద్యార్థి , యువజన సమాఖ్య నాయకులు కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ( పాఠశాల విద్య ) , కడప.(ఆర్జేడీ) రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఆర్జేడీ) యం. వెంకట కృష్ణారెడ్డి గారికి వినతి పత్రాన్ని అందించి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ వామపక్ష పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామినేని రాజునాయుడు , ఏ.ఐ.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు , జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర , విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ యాదవ్ , పీ.డీ.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు మహేంద్ర , ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ లు మాట్లాడుతూ.బీటీఎఫ్ సతీష్ కుమార్ పై విద్యాశాఖ అధికారులు విచారణ వేగవంతం చేయాలని , ఈయన ప్రస్తుతం గోస్పాడు మండలం రేవనూరు పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ , విద్యార్థులకు పాఠాలు బోధించకుండా ఓడీలు వేసుకొని వ్యక్తిగత పనులు చేసుకుంటూ తోటి ఉపాధ్యాయులపై అక్రమంగా పిటిషన్లు , సమాచార చట్టాలు కోరుతూ ఉద్యోగులను , ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తూ , రాక్షస ఆనందం పొందుతున్నాడు. ఎంతో మంది ఉపాధ్యాయులు , ఇతర శాఖల అధికారులు , ఉద్యోగులపై పనిగట్టుకొని తప్పుడు వివరాలు అడుగుతూ వారిని మెంటల్ టార్చర్ చేస్తూ , ఉద్యోగాలు చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నాడు ఈ సతీష్ కుమర్ అని వారన్నారు.దాదాపు కర్నూలు జిల్లా వ్యాప్తంగా 500 నుండి 700 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు , ఇతర శాఖల ఉద్యోగులు బాధితులున్నారన్నారు.బీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సతీష్ కుమార్ ప్రతి రోజు ప్రతి నిత్యం ఉద్యోగులను వేధించడమే ఈయన ప్రధాన లక్ష్యమన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఇలాంటి చీడపురుగులను తొలగించి , విద్యార్థులకు న్యాయం చేసి , ఉద్యోగులను ప్రశాంతంగా ఉద్యోగాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## లయోల స్కూల్ 3వ వార్షికోత్సవ సందర్భముగా క్రికెట్ మరియు కబడ్డీ పోటీలు

తుగ్గలి: ఫిబ్రవరి 21( విభారె)లయోలా పాఠశాల మూడవ వార్షికోత్సవ సందర్భంగా క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లు కరస్పాండెంట్ విష్ణు వర్ధన్ రెడ్డి తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయోల పాఠశాలలో చదువు,క్రమ శిక్షణ,పరిశుభ్రత,సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడలకు ప్రాధాన్యతఇస్తున్నట్లు ఆయన తెలియజేశారు.పిల్లల ఉజ్వల భవిష్యత్తు బాగుండాలంటే చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని,చదువు మానసిక జ్ఞానాన్ని ఇస్తుంది.క్రీడలు శారీరిక ఎదుగుదలకు ఉపయోగపడతాయని వారు తెలియజేసారు.లయోల స్కూల్ 3వ వార్షికోత్సవ సందర్భముగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు మరియు రాష్ట్ర స్థాయి కబడీ పోటీలునిర్వహించబడును.అసక్తి గల క్రీడాకారులు ఈ సదవకాశమును సద్వినియోగము చేసుకొవాలని వారు తెలియజేశారు.1-3-2022 మంగళవారము క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని,మొదటి బహుమతి:దాత : రాంకొండ సుధాకర్ రెడ్డి, వై.యస్.ఆర్.సి.పి. నాయకులు రు. 30,000/-రెండవ బహుమతి రాంపల్లి నాగభూషణ రెడ్డి, వై. యస్. ఆర్.సి.పి. నాయకులు రు.20,000/-మూడవ బహుమతి: పిండేకల్లు గోపాల్ రెడ్డి, వై.యస్.ఆర్.సి.ది. నాయకులు రు. 10,000/- గెలుపొందిన విజేతలకు అందజేస్తారని వారు తెలియజేశారు.అదేవిధంగా 8-3-2022 మంగళవారము సాయంత్రం 5-00 గంలకు కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయనిమొదటి బహుమతి: మారెళ్ళ సుధాకర్ రెడ్డి, వై.యస్.ఆర్.సి. వి. నాయకులు మారెళ్ళ లింగన్న, వై.యస్.ఆర్.సి.పి. నాయకుడు25000 రూ, రెండవ బహుమతి: రు. 15,000/ -రాత రాతన ఉమామహేశ్వర రెడ్డి, వై.యస్.ఆర్.సి.పి. నాయకులు,మూడవ బహుమతి దాతలు మారెళ్ళ రమేష్, వై. యస్. ఆర్.సి.పి. నాయకులు రు. 10,000/-

# ప్రముఖులకు సన్మానం

కడప ఫిబ్రవరి 21( విభారె):: మైదుకూరులో జరిగిన నగర సంకీర్తన లో సహకారం అందించిన శ్రీ మాచనూర్ సుబ్బరాయుడుగారు, కె పి రామ కృష్ణయ్య గారిని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సహ ప్రముఖ్ వారికి కి సత్కారం చేయడం జరిగింది.



# నాగరాజు పై దాడి అమానుషం



నంద్యాల ఫిబ్రవరి 21( విభారె) :- ఆళ్లగడ్డ పట్టణంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో టీ కొట్టు యజమాని నాగరాజు పై దాడి జరిగిందని మండల కాపు సామాజిక వర్గానికి చెందిన నల్లగట్ల బాలుడు తెలిపారు. కాపు సామాజిక వర్గం వ్యక్తి అయిన నాగరాజు పై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. పోలీసులు పక్ష పాతి ధోరణి లేకుండా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల దాడికి ప్రతి దాడి ఉంటాదని హెచ్చరించారు . వెనువెంటనే దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆళ్లగడ్డ నియోజకవర్గ బలిజ సంఘ నాయకులు

## పోలీసులు న్యాయం చేయాలి.

ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ లో పది మందిపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అలాగే ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి లో నాగరాజు ,వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిందని తెలిపారు.

## అంతర్జాతీయ మాతృ బాషా దినోత్సవం

నందికొట్కూరుఫిబ్రవరి 21( విభారె) నందికొట్కూర్ పట్టణంలోని శ్రీ వైష్ణవి జూనియర్ డ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృ బాషా దినోత్సవని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నందికొట్కూరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు శ్రీ డాక్టర్ ఏం అన్వర్ హుస్సేన్(పి హెచ్ డి) సోమవారం నాడు శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాల మరియు జూనియర్ కాలేజీ ముఖ్య అతిథిగా పాల్గొని తెలుగు బాషా యెక్కగొప్పతనాన్ని గురించి విద్యార్థిని. విద్యార్థులకు కు చెబుతూ దేశ బాషాలందు తెలుగు లెస్స అని వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె రవీంద్ర బాబు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె రవికుమార్. అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ‘పుష్ప’ టీమ్ కి హ్యాట్సాఫ్ చెప్పిన జగపతిబాబు!



ఒక సినిమా హిట్ కావడం వేరు .. సంచలనం సృష్టించడం వేరు. చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ల వరకూ అన్ని వయసుల వారిని ఆకట్టుకోవడం వేరు. ఆ సినిమాలోని పాటలకు .. మేనరిజమ్స్ కు స్పందించడం వేరు. ఈ విధమైన రెస్పాన్స్ ఇండియాలోనే కాకుండా ఇతర దేశాల్లోను కనిపించడం మరో విశేషం.అలాంటి ఒక అరుదైన రెస్పాన్స్ తెచ్చుకున్న సినిమాగా ‘పుష్ప’ కనిపిస్తుంది. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ ఈ సినిమాను తెరకెక్కించాడు. డిసెంబార్ 17వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అప్పటి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ లోను తన ప్రభంజనాన్ని కొనసాగించింది.’పుష్ప’ సినిమాకి కథాకథనాలు .. పాత్రలను మలిచిన తీరు .. దేవిశ్రీ పాటలు ప్రధానమైన బలంగా నిలిచాయి. ప్రతి పాట కూడా ఆడియన్స్ కి ఒక రేంజ్ లో కనెక్ట్ అయింది. ‘శ్రీ వల్లీ’ పాటకి బన్నీ వేసిన ఒక స్టెప్ ఒక రేంజ్ లో జనంలోకి దూసుకుపోయింది.చెప్పు జారిపోతే తిరిగి తొడుక్కుంటూ బన్నీ వేసే ఈ స్టెప్ ను ఎంతోమంది సెలబ్రెటీలు అనుకరించడం విశేషం. అలాగే ‘తగ్గేదే లే’ అనే బన్నీ డైలాగ్ కూడా బాగా పాప్యులర్ అయింది. ఈ మధ్య కాలంలో మేనరిజంతో కూడిన ఒక డైలాగ్ ఇంతగా పాప్యులర్ కావడం ‘పుష్ప’ విషయంలోనే జరిగిందని చెప్పాలి.ఇక ఆయా వేదికలపై పాండా బొమ్మలు .. యానిమేటెడ్ క్యారక్టర్స్ కూడా ‘శ్రీ వల్లీ’ స్టెప్పును వేయడం .. ‘తగ్గేదే లే’ అనే మేనరిజమ్ ను అనుకరించడం చేస్తున్నాయి. ఆయా షోస్ కి ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి అంటే ఈ సినిమా ఎంతగా ప్రేక్షకులను ప్రభావితం చేసిందనేది అర్థం చేసుకోవచ్చు. తాజాగా ఒక షోలో ఒక పాండా బొమ్మ ‘పుష్ప’ లో పాటకి స్టెప్పు వేయగా అక్కడే ఉన్న జగపతిబాబు స్పందించాడు. “నేను కూడా ఆ పాండాతో కలిసి స్టెప్పు వేశాను .. దీనికి కారకులు బన్నీ .. సుకుమార్. ఈ సినిమాను ఇంతగా జనంలోకి తీసుకెళ్లిన ‘పుష్ప’ టీమ్ కి హ్యాట్సాఫ్” అని చెప్పాడు.ఇక ‘పుష్ప 2’ కి సంబంధించిన సన్నాహాలు కూడా చకచకా జరిగిపోతున్నాయి. వచ్చేనెలలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగును మొదలుపెట్టనున్నారు. ‘పుష్ప 2’ను 4 నుంచి 6 నెలల్లో పూర్తిచేయాలని సుకుమార్ టీమ్ కి బన్నీ చెప్పాడట. సాధ్యమైనంతవరకూ ఈ సినిమాను ‘దసరా’ బరిలో దింపాలనే తన నిర్ణయాన్ని ఆయన చెప్పినట్టుగా సమాచారం. ఆ దిశగానే ఈ సినిమాకి సంబంధించిన పనులు మొదలుకానున్నట్టు చెబుతున్నారు. ఈ దసరాకి ‘పుష్ప 2 కాస్త గట్టిగానే సందడి చేస్తాడనే విషయం అర్థమవుతూనే ఉంది.







# 100 కోట్ల ‘రాక్షసుడు 2’ పరిస్థితేంటి..?

’ఒక ఊరిలో’ సినిమాతో దర్శకుడుగా పరిచయమైన రమేష్ వర్మ.. పలు చిత్రాలకు రచయితగా నిర్మాతగా కూడా వ్యవహరించారు. ‘రైడ్’ సినిమాతో సక్సెస్ అందుకున్న దర్శకుడు.. ‘వీర’ ‘అబ్బాయితో అమ్మాయి’ వంటి చిత్రాలతో ఫ్లాప్స్ మూటగట్టుకున్నారు. అయితే చాలా గ్యాప్ తర్వాత ‘రాక్షసుడు’ రీమేక్ తో మంచి విజయాన్ని అందుకుని అందరి దృష్టిని ఆకర్షించారు.ఈ నేపథ్యంలో రవితేజ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ‘రాక్షసుడు’ నిర్మాతలు “ఖిలాడీ” చిత్రాన్ని సెట్ చేసారు. రిలీజ్ కు ముందు భారీ హైప్ క్రియేట్ చేసిన ఈ సినిమా.. థియేటర్లలో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన తెచ్చుకుంది.. ఆడియన్స్ నుంచి ఫ్లాప్ టాక్ వచ్చింది. డైరెక్షన్ కు కూడా మంచి మార్కులు పడలేదు. దీంతో రమేష్ నెక్స్ట్ సినిమా పరిస్థితి ఏంటనే చర్చ మొదలైంది.ప్రొడ్యూసర్ కోనేరు సత్యనారాయణ ‘ఖిలాడీ’ నిర్మాణ దశలో ఉన్నప్పుడే రమేష్ వర్మతో “రాక్షసుడు 2” చిత్రాన్ని అనౌన్స్ చేసారు. ఎ స్టూడియోస్ సమర్పణలో హవిష్ ప్రొడక్షన్ బ్యానర్ పై పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని తీయనున్నట్లు ప్రకటించారు. 100 కోట్ల బడ్జెట్ తో హాలీవుడ్ మూవీ లెవల్ లో తెరకెక్కిస్తామని.. పూర్తిగా లండన్ లో చిత్రీకరించబడుతుందని తెలిపారు. అంతేకాదు ఇందులో ఓ స్టార్ హీరో నటిస్తారని మేకర్స్ వెల్లడించారు.అయితే ‘ఖిలాడి’ రిజల్ట్ తో ఇప్పుడు ఈ 100 కోట్ల ప్రాజెక్ట్ ని రమేష్ వర్మ డీల్ చేయగలరా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సినిమా ఫలితం మీదనే ఎవరి కెరీర్ అయినా ఆధారపడి ఉంటుంది.

# సాహా ట్వీట్.. వాట్సాప్ మెసేజ్‌ల స్క్రీన్‌షాట్లు.. రంగంలోకి బీసీసీఐ..! ‘అతడు కాంట్రాక్ట్ ప్లేయర్..’




టీమిండియా వెటరన్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా వ్యవహారం భారత క్రికెట్ వర్గాల్లో సంచలనం రేపుతోంది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ఎంపిక కాని నేపథ్యంలో.. హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్‌పై సాహా పలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. తనను రిటైర్ అవ్వాలంటూ ద్రవిడ్ సలహా ఇచ్చాడని పేర్కొన్నాడు. అంతేకాదు బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ తనకు జట్టులో చోటు ఉంటుందని హామీ ఇచ్చాడనడం అనుమానాలకు తావిస్తోంది.బోర్డు నిబంధనలకు విరుద్ధంగా గంగూలీ సెలక్షన్ కమిటీ సమావేశాలకు హాజరవుతున్నారని అప్పట్లో వార్తలు వినిపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సాహా వ్యాఖ్యలతో ఈ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. అసలు భారత క్రికెట్‌లో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదంటూ అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే... రాహుల్ ద్రవిడ్‌పై సంచలన వ్యాఖ్యలు చేయడం సహా... ఓ జర్నలిస్టు తనను ఉద్దేశించి బెదిరింపు ధోరణిలో మెసేజ్‌లు పంపాడంటూ సాహా ట్విటర్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశాడు. “భారత క్రికెట్‌కు ఎన్నో ఏళ్లుగా సేవలు అందించిన తర్వాత.. సోకాల్డ్ ఓ జర్నలిస్టు నా పట్ల ప్రదర్శించిన ‘గౌరవం’ఇది! జర్నలిజం ఎలా మారిపోయిందో చెప్పడానికి ఇదే ఉదాహరణ’ అంటూ సదరు వ్యక్తి తనకు పంపిన వాట్సాప్ మెసేజ్‌లు సాహా షేర్ చేశాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి సహా... వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ తదితరులు అతడికి అండగా నిలిచాడు. ఒక క్రికెటర్ పట్ల సదరు జర్నలిస్టు వ్యవహరించిన తీరును ఖండిస్తున్నామని, అతడి పేరు బయటపెట్టాల్సిందిగా వృద్ధికి సూచించారు. ఇక ఈ విషయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి జోక్యం చేసుకోవాలని రవిశాస్త్రి విజ్ఞప్తి చేశాడు.ఈ పరిణామాల క్రమంలో సాహా వివాదంపై దృష్టి సారించిన బీసీసీఐ... ఈ అంశంపై విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. సాహాకు మెసేజ్‌లు చేసిన వ్యక్తి ఎవరు? ఇంటర్వ్యూలో అతడు ఏం మాట్లాడాడు? తదితర విషయాల గురించి లోతుగా దర్యాప్తు చేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో టైమ్స్ ఆఫ్ ఇండియాతో ఓ బీసీసీఐ అధికారి మాట్లాడుతూ... “బీసీసీఐ కాంట్రాక్ట్ ప్లేయర్ సాహా. అతడి పట్ల ఎవరైనా అవమానకరంగా వ్యవహరిస్తే బోర్డు చూస్తూ ఊరుకోదు.బెదిరింపులకు పాల్పడితే అస్సలు సహించదు. కచ్చితంగా విచారణ ఉంటుంది” అని వ్యాఖ్యానించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**